JEE ADVANCED 2024
4,187+
శ్రీచైతన్య సాధించిన ర్యాంకులు

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో JEE ADVANCED 2024
టాప్ 500 లోపు 122 ర్యాంకులు
టాప్ 1000 లోపు 203 ర్యాంకులు

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 161 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శే. ఉ. 6.28; దుర్ముహూర్తం: మ. 12.40-1.32, మ. 3.16-4.09; అమృతఘడియలు: మ. 2.54-4.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 10-6-2024 | Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమశిలకు పెరిగిన ఇన్‌ఫ్లో

● ఎగువ నుంచి 2,966 క్యూసెక్కుల రాక

అనంతసాగరం, జూన్ 9: ఎగువ ప్రాంతాల నుంచి సోమశిలకు వచ్చే ప్రవాహం పెరిగింది. శనివారం 521 క్యూసెక్కులు నమోదు కాగా, ఆదివారానికి ఈప్రవాహం 2,966 క్యూసెక్కులకు చేరింది. జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 7.525 టీఎంసీల నీటి మట్టం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో

జిల్లా విద్యార్థుల ప్రతిభ

● ఓబీసీ కోటాలో 11, 27వ ర్యాంకు
● 1000లోపు మరో 9 మందికి..
● నేటి నుంచి కౌన్సెలింగ్

నెల్లూరు (విద్య), జూన్ 9: దేశంలోని ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీల తోపాటు పలు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ సీట్లను భర్తీ చేసేందుకు రాసే ప్రతిష్ఠాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ఫలితాలు ఆదివారం ఉదయం విడుదలయ్యాయి. ఈ ఏడాది మే 26న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఉదయం. మధ్నాహ్నం రెండువిడతలుగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 2,800 మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపడంతోపాటు 75శాతంమంది ఉత్తీర్ణత సాధించారు. బీటెక్, బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్(బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీకి జోసా పేరుతో సంయుక్తంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 10 (సోమవారం) నుంచి జూలై 23వతేదీ వరకు కౌన్సెలింగ్ జరగనున్నట్లు విద్యాసంస్థల ప్రతినిధులు తెలిపారు. జాతీయ పరీక్షల సంస్థ గతంలో జరిగిన మెయిన్స్ పరీక్షల్లో వచ్చిన స్కోర్‌ను పరిగణలోకి తీసుకుని ర్యాంకులను కేటాయించింది. ఆయా సామాజిక విభాగాలను బట్టి కటాఫ్ స్కోర్ నిర్ణయించారు. వీరిలో నెల్లూరుకు చెందిన షేక్.సూరజ్ ఓబీసీ కేటగిరిలో ఆలిండియా 11వ ర్యాంక్, బిరుదురాజు బద్రీనాథ్‌వర్మ ఆలిండియా 27వ ర్యాంకు, ఎం.లావణ్య చంద్రిక 439వ ర్యాంకు, ఓ.చక్రేష్ 523వ ర్యాంకు, బీ.శ్రీకాంత్ 638వ ర్యాంకు, జె.చరిత సాయి సుష్మ 752వ ర్యాంకు, ఎ.విరించి 843వ ర్యాంకు, ఎస్‌సీ కేటగిరిలో డీ రూపేష్ 93వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో పీ సాయినితీష్ 151వ ర్యాంకు, బీ రితేష్‌రెడ్డి 206వ ర్యాంకు, కే మనోజ్‌కుమార్‌రెడ్డి 542వ ర్యాంకు సాధించారు.



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తా...

నెల్లూరు నగరానికి చెందిన తాను భవిష్యత్‌లో కంప్యూటర్ సైన్స్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణించాలనుకుంటున్నా. విద్యాసంస్థల్లో అధ్యాపకులు అందించిన విద్యావిధానాలు, తల్లిదండ్రులు మల్లీశ్వరి, దరియాసాహెబ్‌ల ప్రోత్సహించడంతో ఈ ర్యాంకు సాధించా. అడ్వాన్స్‌డ్‌లో ఓబీసీ కేటగిరిలో 11వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది.

- ఎస్‌కె.సూరజ్, ఓబీసీ కేటగిరి 11వ ర్యాంకర్

కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్‌గా రాణిస్తా..



నెల్లూరు మూలాపేటలో నివాసం ఉండే తాను ఉత్తమ విద్యార్థిగా విద్యలో రాణించా. తల్లిదండ్రులు శిరీష, మధుసూదన్ రావు అందించిన ప్రోత్సాహం, అధ్యాపకులు అందించిన నాణ్యమైన విద్యతోనే ర్యాంకు సాధించా. ముంబయి ఐఐటీలో సీటు సాధించాలన్న పట్టుదలతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓబీసీ కేటగిరిలో 27వ ర్యాంకు సొంతం చేసుకున్నా. ఇదే ఉత్సాహంతో భవిష్యత్‌లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా గుర్తింపు పొందుతా.

-బిరుదురాజు బద్రీనాథ్ వర్మ, ఓబీసీ కేటగిరి 27వ ర్యాంకర్

సిటీ ప్లానింగ్‌లో

పక్కా అవినీతి!

నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని సిటీ ప్లానింగ్ విభాగం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ముందే అక్రమాలకు ఆలవాలమైన ఈ విభాగం తాజాగా మరింత బరితెగించి ఫోర్జరీ సంతకాలకు కూడా సిబ్బంది తెగబడ్డారు. నూతన భవనాలను అనుమతులు దగ్గర నుంచి మార్టిగేజ్‌ల విడుదల వరకు ప్రతి ఫైల్‌కు ఓ రేటు విధిస్తున్నారు. అంతేకాక కమీషన్ల పేరుతో అధికారులు విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో నానాటికి కార్పొరేషన్ ప్రతిష్ట భ్రష్టుపడుతున్నా, చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కాగా ఫోర్జరీ స్కాంలో మేయర్ భర్త పేరు ప్రముఖంగా వినిపించడం గమనార్హం.



● ప్రతి ఫైల్‌కి ఓ రేటు ● విచ్చలవిడిగా కమీషన్ల వసూలు
● బరితెగించి అధికారుల సంతకాలు ఫోర్జరీ
● నానాటికి భ్రష్టుపడుతున్న నగర కార్పొరేషన్
● చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల విఫలం

నెల్లూరు(సిటీ), జూన్ 9: సిటీ ప్లానింగ్ విభాగం అనగానే గుర్తుకువచ్చేది ఫైలు... దానికి వసూలు చేసే కమీషను. భవన నిర్మాణంలో ఈ విభాగం ఇచ్చే అనుమతులకు తీసుకునే కమీషను ఒక ఎత్తైతే... ఆ నిర్మాణంలో మార్టిగేజ్ రిలీజ్‌కు తీసుకునే కమీషను మరో ఎత్తు. నిర్మాణంలో జరుగుతున్న అతిక్రమణలను చూసీచూడనట్లు ఉన్నందుకు పొందే ఆర్థిక ప్రయోజనం ఇంకోకెత్తు. ఇలా ప్రతి పనికి ఓ రేటు విధిస్తున్న ఈ విభాగంలోని అధికారులు ఆర్థిక పరమైన ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ అవినీతి పరంపరలో మరింత ముందడుగు వేసిన సిటీ ప్లానింగ్ అధికారులు మరింత బరితెగించి ఏకంగా కమిషనర్ సంతకాన్నే ఫోర్జరీ చేసే స్థాయికి చేరుకోవడం గమనార్హం. ఇలా ఒకటి కాదు. రెండు కాదు ఏకంగా 70 ఫైళ్ల వరకు ఇలా జరిగినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందులో ముట్టిన సొమ్ము రూ.లక్షలు దాటి కోట్లకు చేరుకున్నట్లు ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు లేఖలను బట్టి తెలుస్తున్నది.

● ఎవరెవరి హస్తం....?

భవన నిర్మాణంలో ఓసీ మంజూరు, మార్టిగేజ్ విడుదల వంటి విషయాల్లో కమిషనర్ సంతకాలు ఫోర్జరీ జరిగాయంటూ ఓ న్యాయవాది లిఖిత పూర్వకంగా అందించిన ఫిర్యాదు ప్రస్తుతం పురపాలక శాఖలోనే చర్చనీయాంశంగా మారింది. ఈ రాకెట్‌లో ఎవరెవరి ప్రమేయం ఉందన్న అంశం ఆశక్తికరంగా మారింది. ఒక్క వ్యక్తితో జరిగేదికాదని గుసగుసలు వినిపిస్తుండగా, సిటీ ప్లానింగ్‌లోని క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగానూ పాత్ర, సూత్రదారులుంటారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

● మేయర్ భర్తపై తీవ్ర ఆరోపణలు

ఫోర్జరీ సంతకాల రాకెట్‌లో మేయర్ భర్త ప్రమేయం ఉన్నట్లు న్యాయవాది కాకు మురళి లిఖితపూర్వకంగా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ ప్రతిష్ఠ దెబ్బతింటున్నదని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రకటించడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పటి వరకు జరిగిన పలు అవినీతి వ్యవహారాల్లో అధికారులు, సిబ్బంది ప్రమేయం బయటకు రాగా, తాజా ఫోర్జరీ రాకెట్‌లో ఏకంగా మేయర్ భర్త పేరును ఫిర్యాదుదారుడు ప్రముఖంగా ప్రస్తావించడం గమనార్హం. బాధ్యులైన అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేసిన కమిషనర్ అంతటితో సరిపెట్టుకుంటారా...? లేక లోతైన విచారణ జరుపుతారా...? అన్నది చర్చనీయాంశంగా మారింది.

నత్తే నయం

సా...గుతున్న పెన్నా బ్రిడ్జి పనులు
ఇంకా పూర్తికాని గడ్డర్ల ఏర్పాటు
బ్రిడ్జి రోడ్డు కోసం భూసేకరణా పెండింగే..
నిత్యం ట్రాఫిక్‌తో ప్రజల కష్టాలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 9: నెల్లూరు పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడనక సాగుతున్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టిన ఈ పనులు ఏడాదికాలంగా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఇంతవరకు బ్రిడ్జి గడ్డర్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. దీంతోపాటు బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డుకు అవసరమైన భూసేకరణ కూడా ప్రారంభించలేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారో అర్థం కావడంలేదు. ఇనమడుగు నుంచి పడుగుపాడు వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. అయితే వెంకటేశ్వరపురం,శెట్టిగుంటరోడ్డు ప్రాంతాల్లో బ్రిడ్జి రోడ్డుకు అవసరమైన భూసేకరణ చేయలేదు. వెంకటేశ్వరపురం ప్రాంతంలో సుమారుగా 40 ఏళ్ల నుంచి వేలాదిమంది నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. వీరందరికీ పరిహారం చెల్లించి, నిర్మాణాలను తొలగించాల్సి ఉంది. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత. ఇకపోతే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన సుమారు రూ. 100 కోట్లను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. అయితే భూసేకరణ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉంది. అది ఎప్పటికి చేస్తుందో తెలియడం లేదు.

● ట్రాఫిక్‌తో ప్రజల ఇక్కట్లు

నెల్లూరు నగరం రోజురోజుకు విస్తరిస్తుండటంతో నిత్యం నగరానికి వస్తున్న వాహనాల సంఖ్య పెరుగుతూనే ఉంది. దీంతో ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో పాతపెన్నా బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభిస్తున్నది. సమయానికి విధులకు వెళ్లాల్సిన వేలాదిమంది తరచూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.


సాగుతున్న పెన్నా వంతెన పనులు





హరివిల్లు కనువిందు

వేసవి తాపంతో సుమారు రెండు నెలలు అల్లాడిన జిల్లా ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఊరట చెందుతున్నారు. కోవూరు - పడుగుపాడు మార్గంలో ఆదివారం సాయంత్రం కురిసిన చిరుజల్లుల అనంతరం ఏర్పడిన ఇంద్రధనస్సు చూసి ఆబాల గోపాలం కేరింతలు కొట్టారు. అలాగే సంగం మండల కేంద్రంలోనూ హరివిల్లు గ్రామస్థులకు కనువిందు చేసింది.

- కోవూరు / సంగం

ముమ్మరంగా వరిసాగు

● ఇప్పటికే 90 వేల ఎకరాల్లో నాట్లు

● మరోవారం వరకు కొనసాగే అవకాశం

నెల్లూరు (వ్యవసాయం), జూన్ 9 : రాష్ట్రంలో ఎక్కడా లేని ఎడగారు సీజన్ జిల్లాకు ప్రత్యేకం. రైతులు దీన్ని రెండోపంటగా పిలుచుకుంటున్నారు. వ్యవసాయ శాఖ మాత్రం దీన్ని ఖరీఫ్ సీజను కిందే పరిగణిస్తుంది. ఏప్రిల్ మూడో వారం నుంచి మే మొదటి వారం వరకు రైతులు నార్లు పోసుకుంటారు.ఈ సీజన్‌కు సంబంధించి రైతులకు సబ్సిడీ విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలను సైతం వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచింది. అయితే, 2016 తర్వాత నుంచి వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. 2016లో వర్షాలు పడడంతో ఆ ఏడాది ఎడగారు దాదాపు 1,82,500 ఎకరాల్లో వరి సాగుచేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తరువాతి నుంచి వర్షాలు లేకపోవడంతో కేవలం బోర్లు, బావుల కింద మాత్రమే సాగైంది. 2017, 18లలో దాదాపుగా 1,07,500 ఎకరాలో సాగవ్వగా 2019లో కేవలం 40వేల ఎకరాలకే పరిమితమైంది. 2020లో దాదాపుగా 3లక్షల ఎకరాలకుపైగా సాగుచేశారు. 2021లో కాలువల ఆధునీకీకరణతో సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. గతేడాది 95వేల ఎకరాలు సాధారణ విస్తీర్ణం అయినా దాదాపు 1.2 లక్షల ఎకరాలలో వరిసాగు జరిగింది. ఈ ఏడాది కూడా దాదాపుగా అంతే విస్తీర్ణంలో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాకొచ్చారు. ఇప్పటికే 90వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇంకా సమయం ఉండడంతో విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. కోవూరు, సంగం, కొడవలూరు, అల్లూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, నెల్లూరు రూరల్ తదితర మండలాల్లో రైతులు ఇప్పటికే వరినాట్లు పూర్తిచేశారు. కొన్ని చోట్ల నార్లు కూడా పోసుకున్నారు.



అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ఈ సీజన్‌లో బోర్ల కింద సాగు చేపట్టే రైతులకు 4316 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉంచాం. కెఎన్ఎం-1638 రకం 4050 క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్-34449 రకం 216 క్వింటాళ్లు, బిపిటి-5402 రకం 50 క్వింటాళ్లు సిద్ధం చేశాం. కిలో రూ.5 చొప్పున సబ్సిడీ ఇస్తున్నాం. వీటితో పాటు ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పెసర, కందులు కూడా 50శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతు భరోసా కేంద్రాల వద్ద దాదాపు 854 టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్సు ఎరువులు, ప్రైవేటు డీలర్ల వద్ద దాదాపు 46158 టన్నులమేర ఎరువులు ఉన్నాయి. పచ్చిరొట్ట విత్తనాలు సైతం 8728 క్వింటాళ్లు జిల్లాకు తెప్పించాం. వీటిని 50శాతం సబ్సిడీతో రైతులకు అందచేస్తాం.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 9: నగరంలోని సౌత్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పొదలకూరు రోడ్డు సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన గోపాల్‌రామ్(47) ఎలక్ట్రీషన్‌గా జీవనం సాగిస్తున్నారు. శనివారం గోపాల్‌రామ్, వేదాయపాలెం ప్రాంతానికి చెందిన తన స్నేహితు డు పసుపులేటి దుర్గామహేష్‌తో కలిసి బైక్‌పై బయటకు వెళ్లారు. రాత్రి 10 గంటల సమయం లో అయ్యప్పగుడి సర్కిల్ వద్ద వేదాయపాలెం వైపు వెళ్లేందుకు బైక్‌లో వేగంగా రాంగ్‌రూట్ లోకి రావడంతో అదే సమయంలో గూడూరు వైపు నుంచి శ్రీశైలం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందగా, దుర్గామహేష్‌కు గాయాలయ్యాయి.

గుర్తుతెలియని వృద్ధురాలు..

గుర్తుతెలియని వృద్ధురాలు (55 నుంచి 60) నగరంలోని బీవీనగర్ ప్రాంతంలోని స్నేహనగర్ వద్ద బిక్షాటన చేసుకుంటుండేది. శనివారం రాత్రి వర్షం పడుతుండటంతో ఆ ప్రాంతంలోనే రోడ్డు పక్కన కూర్చొని ఉండగా ఓ కారు వేగంగా వచ్చి ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలకు చేరుకొని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



నెల్లూరు రూరల్, జూన్ 9: నెల్లూరు రూరల్‌లోని నారాయణరెడ్డిపేటలో విద్యుదాఘాతానికి గురై చేపల్లి మల్లికార్జున (34) మృతి చెందాడు. వివరాల మేరకు.. కరెంట్ పని చేస్తూ జీవనం సాగిస్తున్న ఆ యువకుడు ఆదివారం తన ఇంట్లోనే కరెంట్ పని చేస్తుండగా షాక్ కొట్టి అక్కడికక్కడే మరణించాడు. అతనికి భార్య నాగమణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటన పై స్థానిక టీడీపీ, వైసీపీ నాయకులు విస్మయం వ్యక్తం చేశారు. పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

సిద్ధలయ్యకోన జలపాతంలో యువకుడి గల్లంతు



మహేంద్ర

రాపూరు(డక్కిలి), జూన్ 9: సిద్ధలయ్య కోన జలపాతంలో నెల్లూరు మూడోమైలు ప్రాంతానికి చెందిన ఇంటర్ విద్యార్థి మహేంద్ర(23) ఆదివారం గల్లంతయ్యారు. స్థానిక ఎస్ఐ మాలాద్రి తెలిపిన మేరకు.. మహేంద్ర తన నలుగురు స్నేహితులతో కలిసి సిద్ధలేశ్వర కోన జలపాతానికి చేరుకున్నాడు. మిత్రులతో కలిసి జలపాతంలో దిగి సరదాగా సేదతీరారు. కొద్దిసేపటికి పైకి వచ్చాక తమతో వచ్చిన మహేంద్ర కనిపించక పోవడంతో అతను గల్లంతైనట్లు స్నేహితులు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సంఘటన స్థలంలో ఈతగాళ్లతో గాలించిన ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్



సంతపేట పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

నెల్లూరు(క్రైం), జూన్ 9: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయినా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో జిల్లాలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆదివారం కార్డెన్ సర్చ్ ఆపరేషన్‌లు చేపట్టారు. జలదంకి, ఉదయగిరి, వీకేపాడు, సంతపేట, చిన్నబజారు పోలీసు స్టేషన్ల పరిధిలో కార్డెన్ సర్చ్‌లు నిర్వహించి సరైన పత్రాలు లేని 31 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికే కార్డెన్ సర్చ్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా జిల్లాలో హింసాత్మక చర్యలు అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణంపై కేసు

సంగం, జూన్ 9: స్థానిక పంచాయతీపరిధిలోని మజరా గ్రామం వెంకటేశ్వరపురంలో బి.రవి అనే వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. రవి ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాదులు తీశారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు పనులు నిలిపివేయాలని నోటీసులు అందచేశారు. నోటీసులను ఖాతరు చేయకుండా ఇంటి పనులు కొనసాగినట్లు ఇరిగేషన్ ఏఈ బీవీ కృష్ణ అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థల వివాదంలో ఉద్రిక్తత

సంగం, జూన్ 9: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని స్థల వివాదంలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. స్థానికుల వివరాల మేరకు.. బస్టాండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తుల మధ్య స్థల వివాదం న్యాయ స్థానంలో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో కేసులోని ఓ వ్యక్తి రెండు రోజుల కిందట మృతి చెందాడు. దీంతో ఆయన తరుపున సమస్యను రాజీ చేసుకునేందుకు కేసులోని మరొక వ్యక్తితో మాట్లాడేందుకు బస్టాండ్‌లోని దుకాణం వద్దకు వెళ్లాడు. అతను లేకపోవడంతో అక్కడ ఉన్న మరొక వ్యక్తితో మాట్లాడుతూ మాటామాటా పెరిగింది. ఇంతలో ఓ వర్గానికి చెందిన వారు అక్కడ గుమిగూడి మరొక వ్యక్తికి చెందిన వారు కూడా అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలు దూషణలకు దిగారు. సమాచారం అందుకున్న సీఐ రవినాయిక్, ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. దీంతో ఉద్రిక్తత పరస్థితి సద్దుమణిగింది.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



మీరా మృతదేహం

నెక్కొండ, జూన్ 9 : వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో దినసరి కూలీ మహమ్మద్ మీరా (45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకు చెందిన మీరా ఆమె భర్త అరాఫత్ అలీ కొంతకాలంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని సూతారి మేస్త్రీ వెంకటేశ్వర్లు దగ్గర దినసరి కూలీగా చేస్తున్నారు. అయితే తరచూ భార్యాభర్తలు గొడవ పడుతుండేవారు. ఈ నెల 8వ తేది రాత్రి వారు ఎస్సీ కాలనీలోని మేస్త్రీ ఇంటి డాబాపై పడుకున్న తరువాత, రాత్రి సమయంలో భార్యాభర్తలు గొడవపడగా, మేస్త్రీ వెంకటేశ్వర్లు, తోటి కూలీ డాబా పైకివెళ్లి వారికి గొడవ పడవద్దని చెప్పారు. ఆదివారం ఉదయం పనికి రమ్మని పిలవడానికి మేస్త్రీ భార్య లక్ష్మీదేవి డాబాపైకి వెళ్లగా, మీరా మృతి చెంది కనిపించింది. మృతిరాలి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. సూతారి మేస్త్రీ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కాగా, మృతురాలి భర్త అరాఫత్‌అలీ కనిపించడంలేదని, అతని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విద్యాశాఖ డైరెక్టర్‌ను విధుల నుంచి తప్పించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

కావలి, జూన్ 9: విద్యా శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌ప్రకాష్‌ను విధుల నుంచి తప్పించాలని, జీవో నెంబరు 117ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం కావలి పట్టణ శ్రీసాయి డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దశరధరాములు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ కోసం ఏపీటీఎఫ్ అనునిత్యం పాటుపడుతోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్ మాట్లాడుతూ యూనియన్ సభ్యత్వాన్ని ఆగస్టు చివరిలోపు పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం రామారావు, రఘునాధరెడ్డి, రాష్ట్రకౌన్సిలర్ జీ క్రిష్ణయ్య, కే నరసింహారావు, వివిధ మండలాల నాయకులు మధుసూధనరావు, సంజీవ్‌కుమార్, రమణ కుమార్, హరిబాబు, వైవీ నాగేశ్వరరావు, కావలి డివిజన్‌లోని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	164
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	288
స్కిన్‌లెస్	318
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6764
వెండి కిలో ధర	రూ. 91,100
వెండి ఒక గ్రాము	రూ. 93.10

బీజేపీ సంబరాలు



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 9: దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో నగరంలోని శివాజీ సెంటర్‌లో బీజేపీ మోర్చాల సమన్వయకర్త పీ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నేతలు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. పెద్దఎత్తున బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో భారత దేశం విశ్వ గురువుగా మరోసారి ఆవిష్కృతమవుతుందన్నారు. ఈ సంబరాల్లో మిడతల రమేష్, నారాయణరెడ్డి, కేవీ సుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్, పెట్టేటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ పోరాటం

● ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షుడు అశోక్



యూనియన్ వ్యవస్థాపకులకు నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(విద్య), జూన్ 9 : నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వై.అశోక్‌బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే గుర్తింపు పొందిన సంస్థగా ఎస్టీయూ గుర్తింపు పొందిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో ఉపాధ్యాయ, విద్య సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసి అందరి మన్ననలు పొందామన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజమనోహర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టి విజయం సాధించామన్నారు. ఉపాధ్యాయులు తమకు అండగా ఉంటూ నిరంతరం ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎస్టీయూ వ్యవస్థాపకులకు నివాళలర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి కె.నరసింహం, నేతలు ఎ.వీరా స్వామి, ఎస్.వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకట సుబ్బయ్య, సిహెచ్.ప్రశాంతకుమార్, ప్రసాద్ రెడ్డి, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంగంలో కర్ణాటక రాష్ట్ర ఐఏఎస్ అధికారి



కర్నాటి రవీంద్రరెడ్డితో ఐఏఎస్ అధికారి సింధూరి రోహిణి దంపతులు

సంగం, జూన్ 9: కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి సింధూరి రోహిణి దంపతులు ఆదివారం సంగంలోని సమీప బంధువు కర్నాటి రవీంద్రరెడ్డి, లక్ష్మీ ప్రసన్నల ఇంటికి వచ్చారు. ఐఏఎస్ అధికారి సింధూరి రోహిణి అమ్మమ్మ స్వగ్రామం ఆత్మకూరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో రైతులు అన్నిరకాల పంటలు సాగు చేస్తారని తెలిపారు. అక్కడ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజలు, నాయకులు శాంతి పరులని, ప్రశాంతమైన జీవనం సాగిస్తుంటారన్నారు.

ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చొరవతో

పెద్దచెరువు తూముకు షట్టర్లు

● ఆయకట్టు రైతుల హర్షం



కావలి చెరువు వద్ద ఎక్స్‌కవేటర్ సాయంతో షట్టర్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కావలి రూరల్, జూన్ 9: కావలి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన కావ్య క్రిష్ణారెడ్డి చొరవతో ఆదివారం కావలి పెద్దచెరువు తూములకు నూతన షట్టర్లు ఏర్పాటుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో గడిచిన నాలుగు సంవత్సరాలుగా చెరువు తూముల వద్ద షట్టర్లు పూర్తిగా దెబ్బతిని నీరు వృథాగా పోతోందని పలుమార్లు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోకుండా మట్టి కట్టలు వేస్తూ కాలయాపన చేశాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని చెరువు నిండినప్పుడు నీటి వృథా అవుతుండడంతో చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా అందడం లేదన్న విషయాన్ని తాజా ఎమ్మెల్యే కావ్యక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చెయ్యకముందే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంతో లక్ష రూపాయల వ్యయంతో నూతన షట్టర్లు ఏర్పాటుచేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధరలకనుగుణంగా కాస్మెటిక్ చార్జీలు ఏవి?

హాస్టల్ విద్యార్థులకు అందని పౌష్టికాహారం

వార్డెన్లపై ఆర్థిక భారం

పొదలకూరు, జూన్ 9 : మండల కేంద్రంలో ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల హాస్టల్, రెండు బీసీ బాలికల హాస్టల్స్ ఉన్నాయి. అలాగే మహమ్మదాపురంలో రెండు బీసీ బాలుర, ఒక ఎస్సీ బాలుర హాస్టల్ ఉన్నాయి. వీటి అన్నింటిలో 700 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ఇచ్చే కాస్మెటిక్ చార్జీలు ధరలకు అనుగుణంగా అందడం లేదు. ప్రీమెట్రిక్ విద్యార్థులకు రూ.150, పోస్టు మెట్రిక్ విద్యార్థులకు రూ.200 అదనంగా పెంచినట్లు గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. దాన్ని ఆచరణలో అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు.. ప్రభుత్వం మంజూరు చేసే నిధులకు ఎంతో తేడా ఉంది. ఫలితంగా వార్డెన్లు ఇబ్బందులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి నెలకొంది. తమ చేతి నుంచి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని కొందరు వార్డెన్లు వాపోతున్నారు. దీనికితోడు వసతిగృహాల నిర్వహణ ఖర్చులు వీరే వెచ్చించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో చాలామంది అప్పులపాలవుతున్నారు. కందిపప్పు, మాంసం, మినపప్పు, గ్యాస్, కూరగాయలు, పల్లీలు, తదితర వాటికి ప్రభుత్వం ఇప్పటికీ సరైన ధరలు నిర్ణయించలేదు. గతంలో ఇచ్చిన ధరకే టెండరుదారుడు సరఫరా చేస్తున్నారు. ఇందులో నాణ్యత ఉండడం లేదు. సరఫరాలోనూ కోత విధిస్తున్నారు. ఫలితంగా మెనూ సరిగా అమలు కాని పరిస్థితి. ప్రతి ఆదివారం విద్యార్థులకు బిర్యానీ పెడుతున్నారు. ఒక్కో విద్యార్థికి 50 గ్రాములు చొప్పున చికెన్ ఉండాలి. కానీ చిన్న ముక్కలు పెడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. గత నెలలో టమోట, పచ్చిమిర్చి ధరలు ఆకాశాన్నంటాయి. ఆ భారమంతా వార్డెన్లు భరించాల్సి వచ్చింది. విద్యార్థుల సంఖ్యకు తగ్గ బడ్జెట్ లేకపోవడంతో వారానికి రెండు గుడ్లు, రెండు అరటి పండ్లు, ఒకపూట చికెన్ పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వసతి గృహాల్లో ఆన్‌లైన్ హాజరుపడకపోతే డైట్ బడ్జెట్ రాదు. మాన్యువల్‌గా వేసేందుకు వీలుండదు. ఈ నేపథ్యంలో ఆ భారమంతా వార్డెన్లు భరించాల్సి వస్తోంది.

ఉద్యోగాలు ఉండేనా... ఊడేనా?

● ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన

● నూతన మద్యం పాలసీ కోసం ఎదురుచూపులు



నెల్లూరు(క్రైం), జూన్ 9: వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అందులో పనిచేసేందుకు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్స్‌ను నియమించారు. అయితే వారికి ఉద్యోగ భద్రత కల్పించక పోవడం, ఓ ఏజెన్సీ కింద నియామకాలు చేపట్టడంతో ప్రభుత్వం మారాక మా పరిస్థితి ఏమిటని జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వందలాదిమంది యువకులు ఆందోళన చెందుతున్నారు. ఇంతకీ మా ఉద్యోగాలు ఉంటాయా.. ఊడుతాయో.. చెప్పాలంటూ అధికారులను వారు ప్రశ్నిస్తున్నారు. అయితే థర్డ్‌పార్టీ ఏజెన్సీ కింద నియామకాలు చేయడంతో ఉద్యోగాలకు ఎలాంటి భద్రత లేదని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు తేల్చి చెబుతున్నారు.

● **వందలాదిమంది ఉద్యోగులు**

వైసీపీ ప్రభుత్వం 2019లో తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 193 ప్రభుత్వ మద్యం దుకాణాలు, ఎలైట్ షాపులు ఏర్పాటు అయ్యాయి. వాటిలో 650 మందికిపైగా సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లు పనిచేస్తున్నారు. మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే వారిని థర్డ్‌పార్టీ ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం ఉద్యోగాల్లోకి తీసుకుంది. ఆ ఏజెన్సీ ద్వారానే సిబ్బందికి ప్రతినెలా జీతాలు అందిస్తున్నది. తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని గతంలో సిబ్బంది పలుమార్లు వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వ నిరంకుశ విధానాన్ని ప్రశ్నించాలని పలుమార్లు సిబ్బంది ఏకమైనా ప్రశ్నించే వారిని విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులు వచ్చాయి. దీంతో ఎవరికి వారు ఉద్యోగాలు పోతాయన్న భయంతో నోరుమెదపలేదు. దానికితోడు మా పరిస్థితి ఏమిటి సారూ... అని నాయకులను ఆశ్రయిస్తే 'వచ్చేది మన ప్రభుత్వమే.. మీ ఉద్యోగాలు ఎక్కడికి పోవు... ఈ సారి జీతాలు పెంచుతాం'... అంటూ హామీ ఇవ్వడంతో సిబ్బంది ఎంతో ధైర్యంగా ఉండిపోయారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఘోరంగా ఓడించడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే వారి పరిస్థితి అయోమయంగా తయారైంది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తీసుకువచ్చే నూతన మద్యం పాలసీపై వీరి జీవితాలు ఆధారపడి ఉన్నాయి. దీంతో వారు నూతన మద్యం పాలసీ కోసం ఎదురుచూస్తున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఆనంను కలసిన టీడీపీ నాయకులు

కలువాయి, జూన్ 9: ఆత్మకూరు శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులో ఆదివారం టీడీపీ మండల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పీర్ల సోమయ్య యాదవ్ ఆధ్వ ర్యంలో రామనారాయణరెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినంధనలు తెలిపారు.



ఆనం రామనారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోతకు గురైన రోడ్డు మార్జిన్లు



గానుగపెంటపల్లి వద్ద కోతకు గురైన రోడ్డు

ఉదయగిరి, జూన్9: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు గంగిరెడ్డిపల్లి, వెంక ట్రావుపల్లి, గండిపాళెం, గడ్డం వారిపల్లి, కుర్రపల్లి, శకునాల పల్లి, అన్నంపల్లి, బిజ్జంపల్లి, దే కూరుపల్లికి వెళ్లే రోడ్ల మార్జిన్లు కోతకుగురయ్యా యి. ఈ సమస్యతో ఎదురె దురుగా వాహనాలు వచ్చిన ప్పుడు ఇబ్బందులు పడుతు న్నారు. రోడ్డుపైకి వర్ష పునీటి తో కంకరరాళ్లు రావడంతో ద్వి చ క్రవాహనాలు, ఆటోలు ప్ర మాదానికి గురవుతున్నాయి.



గంగిరెడ్డిపల్లి వద్ద కోతకు గురైన పైకొచ్చిన కంకర

పీఎం ప్రమాణ స్వీకారానికి కంచర్లకు ఆహ్వానం

కావలి, జూన్ 9: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలో ఆదివారం చేపట్టిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి కావలి నుంచి బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడికి ఆహ్వానం అందింది. దీంతో పార్టీలో ఆయనకు సముచిత స్థానం కల్పించినట్లుగా భావిస్తున్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం పునఃప్రారంభం

బిట్రగుంట (దగదర్తి) జూన్ 9: దగదర్తి మండలం వెలుపోడు సెంట ర్‌లో ఐదేళ్ళు నిరుపయోగంగా ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకాన్ని మాలేపాటి సోదరుల సొంత నిధులతో మరమ్మతులు చేయించి ఆదివారం పునః ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికలో స్థానిక ప్రజలకు ఇచ్చిన మాట మేరకు సిద్ధం చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతిని మాజీ స్టేట్ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ప్రారంభించారు. యువనేతలు మాలేపాటి భానుచందర్ నాయుడు, లోకేష్ నాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండంపై దృష్టి సారించామని, చంద్రబా బునాయుడి పాలనలో అందరికీ మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో మండల నేతలు ఎం సుధాకర్‌నాయుడు, కంచర్లకృష్ణ, వడ్డే వినయ్ కుమార్, జలదంకి శ్రీహరి తదితరులు ఉన్నారు.



ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకాన్ని పునఃప్రారంభిస్తున్న మాలేపాటి రవీంద్రనాయుడు తదితరులు

కూటమి నాయకుల సంబరాలు.. ప్రత్యేక పూజలు

చేజర్ల, ఏప్రిల్ 9: నియోజకవర్గ శాసనసభ్యుడిగా ఆనం రామనారాయ ణరెడ్డి గెలవడంతో కొలపనాయుడుపల్లికి చెందిన టీడీపీ నాయకుడు అచ్చాల నారాయణరెడ్డి, అచ్చాల చెంచుసుబ్బారెడ్డి దంపతులు కార్యకర్తలతో కలిసి ఆదివారం గ్రామదేవత దేశమ్మకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. అలాగే గాలిపాలెంలో టీడీపీ నాయకులు అన్నదానం చేశారు.

ఉదయగిరి రూరల్: సీఎంగా నారా చంద్రబాబునాయుడు, ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌లు విజయం సాధించడంతో దాసరిపల్లి మాజీ సర్పం చ్ సయ్యద్ జమ్మత్‌బేగం జాఫర్‌మొహిద్దీన్, టీడీపీ మైనారిటీ నాయకులతో కలిసి కడప అమీన్‌పీర్(పెద్ద) దర్గాలో ప్రార్థనలు చేసి 101టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో సయ్యద్ ఖాజానవాజ్, జావీద్, నవాజ్ ఉన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రధాన వీధిలో ఆర్యవైశ్యలతో కలిసి నాలుగో వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో చల్లా రవికుమా ర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, అధికార ప్రతినిధి చండ్రా వెంకటసుబ్బా నాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, దోర్నాదుల సురేష్‌బాబు, మెంటా శ్రీనివా సులు, పరిటాల సత్యం, గ్రంధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీతారామపురం: పండ్రంగిలో తెలు గుయువత జిల్లా అధికార ప్రతినిధి సింగా ల నాగేశ్వరావు స్థానికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వార్డు నెంబర్ కులారి రామలక్ష్మమ్మ, సింగాల సుబ్బయ్య, సింగాల రమణయ్య, సింగాల వెంకటరమణయ్య, కులారి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లిలో జనసేన మండలాధ్యక్షుడు పఠాన్ రసూల్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టి పవన్‌కల్యాణ్ చిత్రప టానికి పూలు, పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేడిద వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్లా, తుంగ వెంకటసాయి, సుత్తినేని రవి పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక అరుంధతీయ కాలనీవాసులు ఆదివారం సాయంత్రం టీడీపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సాయిబాబా ఆలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా రఘు రామిరెడ్డి, బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, పిడిగు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరు: విజయోత్సవంలో టీడీపీ నాయకులు



కలువాయిలో టీడీపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ



ఉదయగిరి రూరల్: కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



వరికుంటపాడులో పాలభిషేకం



చేజర్ల: పూజలకు వెళుతున్న నాయకులు

కావలి ఎమ్మెల్యే కావ్యకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే కావ్యకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందిస్తున్న కమ్మవారి సేవాసమితి సభ్యులు

కావలి, జూన్ 9: కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డి అత్యధిక మెజార్టీ సాధించటంతో కావలి పట్టణం ముసు నూరులోని కావ్య నివాసం ఆదివారం అభిమానులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కిటకిటలాడింది. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కావ్యను కలిసి అభి నందనలు తెలిపారు. కమ్మవారి సేవా సమితి తర పున వారి సభ్యులు వచ్చి కావ్యను సత్కరించారు. అలాగే వివిధ ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు కూడా కావ్యను కలిసి అభినందనలు తెలిపారు. బీద గిరిధర్ ఆధ్వర్యంలో అల్లూరు మండలం నుంచి టీడీపీ క్యాడర్ వచ్చి కావ్యను సత్కరించారు.

టీడీపీ, జనసేన కలయికతో ఊహించని విజయం : బీద



బీద గిరిధర్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

అల్లూరు, జూన్ 9 : టీడీపీ, జనసేన కలయికతో ఊహించని విజయాన్ని సాధించామని నెల్లూరు పార్లమెం టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఆయన నివా సంలో ఆదివారం అల్లూరు మండలం జనసేన అధ్యక్షుడు కారుమంచి కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలుసుకొని శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కత్తుల విజయకుమార్, రాఘవులు అలియాస్ బాబాయ్, చేవూరు సుబ్రహ్మణ్యం, బెజవాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, జూన్ 9: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామ శివారుల్లో వెలసిన నాగవరపమ్మ అలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు. అభిషేకాలు జరిగాయి. ఉదయం గోపూజ, గణపతి పూజ, అంకురార్పణ, అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు వేదపండితులు వరహాచల సాయిరామాచార్యులు శాస్త్రో క్తంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో గణపతి, లక్ష్మీనారాయణ, మృత్యుంజయ హోమాలు, మహాపూర్ణాహుతి, మహానైవేద్యం, మంగళహారతులు పూజలు జరిగాయి. హోమ కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపకులు మాలేపాటి నాగేశ్వరావు దంపతులతో పాటు యారం శ్రీనివాసులు రెడ్డి, నాగేంద్ర, మల్లి మాలేపాటి నాగభూషణం దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంటూరికి ఐటీడీపీ ప్రతినిధుల సత్కారం

కందుకూరు, జూన్ 9: కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులకు 20 సంవత్సరాల తర్వాత విజయం రుచి చూపించిన ఘనత ఇం టూరి నాగేశ్వరరావుదేనని ని యోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా అన్నారు. ఆది వారం స్థానిక టీడీపీ కార్యా లయంలో ఐటీడీపీ ప్రతినిధులు నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ ప్రతినిధులు ముక్లపాటి మహేష్, రాజశేఖర్, రామకృష్ణ, మోదేపల్లి రమేష్, షేక్ షరీఫ్, వలేటి వెంకటేశ్వర్లు, మట్టిపు సురేంద్ర, మేకల అశోక్, దివాకర్ పాల్గొన్నారు.



ఇంటూరిని సత్కరిస్తున్న ఐటీడీపీ ప్రతినిధులు

వలేటివారిపాలెం: మండలంలోని నలదలపూరులో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నా గేశ్వరరావుకు గ్రామస్థులు ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం దివంగత నంద మూరి తారకరామారావు విగ్రహనికి నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలు, నాయకులతో కలిసి సంబరాలు చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయ కులు అత్తోటి రమేష్, పొన్నగంటి రామయ్య, మన్నం మహేశ్వరావు, మన్నం సుబ్బారావు, మన్నం కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాన్ని తప్పించి గుండెపోటుతో కుప్పకూలిన బస్సుడ్రైవర్

కందుకూరు, జూన్ 9 : వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌కు గుండెపో టు రావడంతో చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికుల ప్రాణాలు కాపాడి తనువు చాలిం చాడు.ఈ సంఘటన కందుకూరు సమీపంలోని ఓగూరు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. కందుకూరు నుంచి 50 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరిన బస్సు ఓగూ రు వద్దకు చేరేసరికి బస్సు డ్రైవర్‌కు ఆకస్మికంగా గుండెపోటు రాగా ఆయన బస్సును రోడ్డు మార్జిన్‌లో ఆపి సీటులో కుప్పకూలి మృతిచెందాడు. ఈ ఘటనతో దిగ్భ్రాంతికి గురైన ప్రయా ణికులు తృటిలో తప్పిన ఘోర ప్రమాదాన్ని తలుచుకొని ఆందోళన చెందారు.

జలదంకిలో కూటమి నేతల సంబరాలు

జలదంకి, జూన్ 9: కేంద్రంలో వరుసగా మూడోసా రి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండడంతో కూటమి నాయ కులు స్థానిక కార్యాలయంలో ఆ దివారం సాయంత్రం సంబ రాలు చేసుకున్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు కంచర్ల శరత్ ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో టీడీపీ, జనసేన మండల అధ్య క్షులు పి మధుమోహన్‌రెడ్డి, తో ట మురళీలతో పాటు మూడు పార్టీల రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొని భారీకేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సంబరాల్లో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ నేతలు బండారు తిరుపతిరెడ్డి, చల్లా హనుమారెడ్డి, జిల్లా నేత మారెళ్ళ బ్రమ్మా రెడ్డి, జనసేన జిల్లా నాయకుడు నిమ్మలపల్లి రామ్‌చైతన్య, జలదంకి ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

గురుకులంలో టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, జూన్ 9: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సి ప ల్ కామేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంగ్లీషు, హిందీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించుటకు అర్హత కలిగిన మహిళలు మాత్ర మే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 12, 13 తేదీలోగా దరఖాస్తులను ఆత్మకూరులోని గురుకుల పాఠశా లలో అందజేయాలన్నారు. ఇంగ్లీషులో టీజీటీ, పీజీటీ, హిం దీ బోధనలకు టీజీటీ, పీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

సంగం, జూన్ 9: దువ్వూరు, అన్నారెడ్డిపాళెంలోని ని రుపేద కుటుంబాలకు ఆదివారం జనసేన నాయకులు ని త్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్, భానుకిరణ్, హరీష్ కుమా ర్, హరి, నాయబ్‌భాష, చక్రవర్తి పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



గుంతలు పూడ్చుతున్న పంచాయతీ సిబ్బంది

ఉదయగిరి రూరల్, జూన్ 9: స్థానిక నాగుల బావివీధి, సచివాలయం-3 సమీపంలోని ప్రధాన రహ దారికి మధ్యలో ఉన్న గుంతలను ఆదివారం పంచాయతీ సిబ్బంది పూడ్చివేశారు. ఈ నెల 6న 'రోడ్ల మధ్యలో గుంత లతో రాకపోకలకు అవస్థలు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి కరీము ల్లా సిబ్బందితో గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బం దులు లేకుండా చేశారు. గుంతలు పూడ్చడంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

కొరవడిన పారిశుధ్యం

ఉదయగిరి రూరల్, జూన్ 9: స్థానిక గాజుల వీధిలోని చేతిపంపు, చేదురబావి చుట్టూ చెత్త పేరుకుపో యి దుర్వాసనతో అల్లాడు తున్నామని ఆ ప్రాంత ప్రజలు ఆదివారం వాపోయారు. పంచాయతీ పారిశుధ్య కార్మి కు లు రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో ఈ సమ స్య నెలకొందని వాపోయారు. వ్యాధులు ప్రబలుతా యో నని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికా రులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

ఏఎస్ పేట, జూన్ 9: టీడీపీ మండలాధ్యక్షుడు అబ్బూరి రమేష్ నా యుడు, జిలానీ బాషా, ఖాజామియ్య, ఖాదర్‌బాషా, శ్రీహరి నాయుడు, వాకి చర్ల బాబు, కృష్ణారెడ్డిలు స్థానిక దర్గా సెంటర్‌లో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల జర్నలిస్టులు సంతాప సభ నిర్వహించి రామోజీరావు చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో విలేకర్లు పెం చలమోహన్, జిలాని, రహమత్ ఆలీ, రహమత్, రాజా, సంజీవయ్య, అమీర్‌జాన్, రబ్బని, దావుద్ పాల్గొన్నారు.



మర్రిపాడులో నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

మర్రిపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం టీడీపీ నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అరికట్ల జనార్దన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, ఎలగాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 9: త్రైతసి ద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు సభ్యులు ఆదివారం నంది పాడులో భగవద్గీతపై విస్తృత ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రసా ద్, కమిటీ సభ్యులు పెంచలం రత్నం, నరసింహులు, నాగమ్మ పాల్గొన్నారు.



పొనుగోడులో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఏఎస్ పేట: త్రైత సిద్ధాంత భగవద్గీతపై త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ సభ్యులు పొనుగోడు, తాటిరెడ్డిపల్లి,రాజవోలులో ప్రచారం నిర్వహిం చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పెంచల నరసయ్య, సభ్యులు కార్తీక్, పెంచల స్వామి, సుధాకర్ ఆచారి, అభినయ, భాగ్యమ్మ, గాయత్రి, జాహ్నవి, పద్మమ్మ, కొండయ్య పాల్గొన్నారు.

చినుకు రాలితే చిత్తడే..

ఉదయగిరి రూరల్, జూన్ 9: స్థానిక గండిపాళెం మార్గం, బాలాజీ నగర్, చిన్నమసీదు ప్రాంతాల రోడ్లపై వర్షపు నీరు నిల్వ చేరడంతో ప్రజలు రాకపోలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం వస్తే మురుగు కాలువలు పొం గుతాయని వాపోతున్నారు. శనిరాత్రి నుంచి చిరుజల్లులు పడుతుండడంతో పలు ప్రాంతాలు చిత్తడిగా మారాయి.



గండిపాళెం మార్గంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వరికుంటపాడు: మండలంలో శనివారం రాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తారు వర్షం ఆది వారం తెల్ల వారుజాము వరకు కురిసింది. ఆపై కొంత సమయం తెరుకున్నా మధ్యాహ్నం నుంచి విడత వారీగా వర్షం కురుస్తూనే ఉంది. వాగులు, వంకల్లోకి కొంతమేర నీరు చేరింది. రహదారులు, వీధుల్లో ఎక్కడి నీరు అక్కడే నిలిచి పోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

పని చేయని ఏటీఎంలు

ఉదయగిరి, జూన్ 9: పట్టణంలోని మెయిన్‌బజార్, సొసైటీ కార్యాలయం, బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు ఏటీఎంలు రెండు రోజులుగా పని చేయడం లేదు. ఈ సమస్యతో ఖాతాదారులు సకాలంలో నగదు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై స్థానిక బ్యాంకు అధికారులను వివరణ కోరడానికి వెళ్లగా శని, ఆదివారాల్లో సెలువు దినాలు కావడంతో ఎవరూ బ్యాంక్ అధికారులు అందుబాటులో లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏటీఎంలు పనిచేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ఏఎస్ పేట, జూన్ 9: ఆత్మకూరు క్రాస్ రోడ్డు నుంచి ఏఎస్ పేట మీదుగా హసనా పురానికి నూతనంగా నిర్మి స్తున్న తారురోడ్డు పనులను ఆదివారం టీడీపీ నాయకులు తెల్లపా డులో పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్ర మంలో పార్టీ మండ లాధ్యక్షుడు అబ్బూరి రమేష్ నాయుడు, జిలాని, ఖాదర్, ఖాజమియా, బాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలి

కలిగిరి, జూన్ 9: సత్వర న్యాయం కోసం ప్రజలు లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలని కావలి డివిజన్ లోక్ అదాలత్ సభ్యుడు ఎమ్ మాలకొండారెడ్డి తెలిపారు, ఆదివారం ఆయన మాట్లాడుతూ కోర్టుకు రాని కేసులు, పెండింగ్ కేసులను కాలయాపన లేకుండా అప్పీలులేని అంతిమతీర్పును లోక్ అదాలత్ ఇవ్వడం జరుగుతుందన్నారు, కావలి సబ్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తుల సమక్షంలో రాజీల ద్వారా కేసులకు పరిష్కార మార్గం సులభంగా దొరుకుతుందన్నారు. డివిజన్ పరిధిలోని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, జూన్ 9: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో లింగసముద్రం పోలీసులు ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. ఆదివారం గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో పేకాట శిబిరంపై దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి, రూ.5010 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి రాళ్లపాడు నీరు మన్నేరుకు విడుదల

● చీమలపెంట టీడీపీ నేతల ఆందోళన

లింగసముద్రం, జూన్ 9: రాళ్లపాడు ప్రాజెక్టులోని నీటిని అర్ధరాత్రి సమయాల్లో మన్నేరుకు విడుదల చేస్తున్నారని పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంట గ్రామ టీడీపీ నేతలు, ఆయకట్టు రైతులు గంగినేని మధుసూదనరావు, బొల్లినేని రమణయ్య, కరణం మోహన్‌రావు, ముత్తలూరి సుధాకర్, కరణం హజరత్తయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత పదిహేను రోజులలో నాలుగు సార్లు రాళ్లపాడు నీటిని గేట్ల ద్వారా మన్నేరుకు విడుదల చేశారని, కేవలం ప్రాజెక్టులో చేపలు పెంచుతున్న వారి కోసం నీటిని విడుదల చేశారని వారు ఆరోపించారు. అసలే నీటి ఎద్దడి ఉన్న సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న దశలో ఇలా నీరు విడుదల చేయడం పట్ల తమతో పాటు ఆయకట్టు రైతులు కూడా ఆందోళన చేస్తున్నట్టు వారు చెప్పారు.

ఘనంగా కనకదుర్గమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, జూన్ 9: బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీ గ్రామస్థుల ఆధ్వర్యంలో పోలేరమ్మకు పొంగళ్ళ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కనకదుర్గమ్మకు భక్తులు పొంగళ్ళను సమర్పించారు. ఉదయం గ్రామంలోని ప్రతి కుటుంబం ఊరు శివా రుల్లోని పొల్లాలో కనకదుర్గమ్మ అందమైన ప్రతిమను ఏర్పాటు చేశారు. గుడారాలు నిర్మించుకుని బంధుమిత్రులను ఆహ్వానిం చుకుని పొంగళ్ళను పొంగించి వనభోజ నాలు చేశారు. తప్పెట్లు తాళాలతో అమ్మవారిని ఊరేగించి జలిదిలో నిమజ్జనం చేశారు.



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ

నేడు బండలాగుడు పోటీలు

కొండాపురం, జూన్ 9: మండలంలోని కొమ్మి గ్రామంలో రాములవారి తిరునాళ్లలో భాగంగా ఆదివారం అంకురార్పణ కార్యక్రమం జరిగింది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణతోపాటు మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు, రైతు బాంధవుడు దామా మహేశ్వరరావు పుట్టినరోజు పురస్కరించుకొని సోమవారం రాష్ట్రస్థాయి ఒంగోలుజాతి గిత్తల బండలాగుడు పందేలు, బలప్రదర్శన పోటీలు ఏర్పాటుచేస్తున్నట్లు ఉభయకర్తలు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి గ్రామంలోని శివాలయం దగ్గర పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్యకు అభినందనలు

వలేటివారిపాలెం, జూన్ 9 : వలేటివారిపాలెం మండలంలోని అంకభూపాలపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ శ్రేణులు ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్యే మధులూరి మాలకొండయ్యకు చీరాలలో ఆదివారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెగడ శ్రీనివాసులు (న్యాయవాది), వెంకటరత్నం, ప్రెగడ నరసింహం, సత్యనారాయణ, నరసింహరావు, ప్రెగడ రమణయ్య, ప్రెగడ పిచ్చయ్య పాల్గొన్నారు.

వైసీపీకి, సొసైటీ అధ్యక్ష పదవికి రవిరెడ్డి రాజీనామా

జలదంకి, జూన్ 9: జలదంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు కేతిరెడ్డి రవీంద్రరెడ్డి తన అధ్యక్ష పదవికి, వైసీపీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం జమ్మలపాలెంలోని ఆయన నివాసంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవిరెడ్డి మాట్లా డుతూ వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నానని తెలియజేశారు.

వర్మపై దాడి.. పవన్ సీరియస్..!



- వన్నెపూడి ఘటనపై విచారణకు ఆదేశం
- కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు
- వారం రోజుల్లో పిఠాపురానికి జనసేనాని
- నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు
- జనసైనికులు సంయమనం పాటించాలి: నాగబాబు

అమరావతి (ఆంధ్రజ్యోతి), పిఠాపురం, జూన్ 9: పిఠాపురంలో జనసేన గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన మాజీ ఎమ్మెల్యే వర్మపై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన దాడిని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సంఘటన వెనుక ఎవరున్నారు..? అనే దానిపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీనిపై విచారణ జరిపే బాధ్యతలను పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ అప్పగించారు. ప్రస్తుతం ఆయన నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ఆదివారం ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఈ నెల 12న జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బిజీబిజీగా ఉంటారు. అనంతరం ఆయన పిఠాపురం వెళ్లి అక్కడ పరిస్థితిని చక్కదిద్దనున్నారు. ఈ లోగా సంఘటనకు కారణాలు, ఇతర అంశాలపై పార్టీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నివేదిక సిద్ధం చేయాని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగానే పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాలొన్నట్టు తెలిస్తే మాత్రం వారిపై తీవ్ర చర్యలు ఉంటాయన్న హెచ్చరికలు పంపించారు. తప్పు చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించది లేదని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఇప్పటికే హెచ్చరించారు. అధినేత పవన్ కల్యాణ్ వచ్చిన తర్వాత ఘటనపై తుదినిర్ణయం తీసుకోనున్నారు.

ఘటనపై వివరాలు సేకరిస్తున్నాం: నాగబాబు

వన్నెపూడిలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మపై జరిగిన దాడి, తదనంతర పరిణామాలు పార్టీ దృష్టికి వచ్చాయని, దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆదివారం తెలిపారు. పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఇందులో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుచేసిన వారిని ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తాటిపర్తి గ్రామంలో జరిగిన సంఘటన గురించి తమకు సమాచారం ఉందని, పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక నేతలతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. జనసైనికులందరూ సంయమనం పాటించాలని కోరారు. సాధ్యమైనంత వరకూ తాను కూడా నియోజకవర్గంలోనే అందుబాటులో ఉంటానని, సమస్యలు ఏమైనా ఉంటే కూర్చొని పరిష్కరించుకుందామని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మారు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మి ఓటు వేశారని, దీనిపై చర్చ ఎందుకని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఓడిపోవడంపై స్పందిస్తూ 'ఇది ప్రజాతీర్పు అన్నారు. ఆ తీర్పుకు శిరసా వహించాల్సిందే. సీన్ ఈజ్ ఓవర్' అన్నారు. 40 శాతం ఓట్లు వచ్చాయని ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి తెలిపారని, అక్కడినుంచి నిలబడి వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. ఇదే తమ ప్రధాన అజెండా అని చెప్పారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి గిరిజనులంతా తరలిరావాలి: ధారునాయక్

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి గిరిజనులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఘనవిజయం సాధించిన కూటమి తరఫున ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించే దినంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. 16గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ సర్కార్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపిన గిరిజనులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో గిరిజనులు ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

వీసీలు స్వచ్ఛందంగా తప్పుకోవాలి: ఏఎస్ రామకృష్ణ

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులందరూ వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం బలవంతంగా తొలగించక ముందే స్వచ్ఛందంగా తప్పుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, ముఖ్యంగా ఆంధ్రావర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, నాగార్జున వర్సిటీ వీసీ రాజశేఖర్ వైసీపీ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. వర్సిటీల్లో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంపై దృష్టి పెట్టకుండా, వర్సిటీలను వైసీపీ కార్యాలయాలుగా మార్చారు. అత్యుత్సాహంతో వర్సిటీల్లో వైఎస్సార్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ఘన విజయంతో అధికారం చేపడుతున్నా, ఇంకా ఏ ముఖం పెట్టుకుని, వీసీ పదవుల్లో కొనసాగుతారని మండిపడ్డారు.

బాబు పాలనలో ఏపీ అభివృద్ధి చెందాలి

- కాబోయే సీఎంకు నవీన్ పట్నాయక్ అభినందనలు

భువనేశ్వర్, జూన్ 9: టీడీపీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కాలని బీజేడీ చీఫ్, ఒడిసా ఆపద్ధర్మ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించినందుకు చంద్రబాబును అభినందించారు. చంద్రబాబుతో మాట్లాడి అభినందనలు తెలియజేశానని ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తన రాజకీయ జీవితంలో చంద్రబాబుతో సుదీర్ఘ అనుబంధం ఉందని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించగా, వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే.

హైవేపై ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- బెంబేలెత్తిన వాహనదారులు.. కాంట్రాక్టర్ కక్కుర్తే కారణం
- కత్తిపూడి- ఒంగోలు హైవేపై తప్పిన పెను ప్రమాదం



గుడివాడ, జూన్ 9: కాంట్రాక్టర్ కక్కుర్తి ఫలితంగా ఏకంగా జాతీయ రహదారి పైనే విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై ఒక్కసారిగా స్తంభాలు వంగిపోవడంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. గుడివాడ మండలం రామనపూడి గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం సుమారు 11.30 గంటలకు ఒక్కొక్కటిగా 7 స్తంభాలు నెలకొరిగాయి. అయితే ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒరిగిన స్తంభాలు దాదాపుగా రహదారికి సగానికి పైగా ఆక్రమించడంతో ప్రమాదకరంగా మారాయి. కాగా, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. విద్యుత్ అధికారులు తీరిగ్గా సాయంత్రం 5 గంటలకు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి వైర్లను కత్తించారు. స్తంభాలను యథావిధిగా వదిలేశారు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయలేదు. దాదాపు ఐదున్నర గంటలపాటు ప్రజలు ఆ ప్రాంతంలో బిక్కుబిక్కు మంటూ గడిపారు. ఇక, ఈ స్తంభాలను వైసీపీ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ నాసి రకంగా వేశారు. స్తంభాలు నిలబెట్టే క్రమంలో సరైన ఫౌండేషన్ వేయలేదు. కక్కుర్తిగా పనులు చేపట్టడంతో అవి ఒరిగిపోయాయి. కాంట్రాక్టర్ వైసీపీ ముఖ్య అనుచరుడు కావడంతో అధికారులు నోరుమెదపలేకపోయారన్న ప్రచారం సాగుతోంది.



గేట్లకు రోప్ లేకుండా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు



అసంపూర్తిగా జీడీపీ ఆనకట్ట బలోపేతం పనులు

'గాజులదిన్నె'కు గండం!

- గేట్లు పెట్టారు.. రోప్ కనెక్షన్లు మరిచారు
- వరద పోటెత్తితే గేట్లు తెరిచే అవకాశమే లేదు
- 30 కోట్ల బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టరు
- జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ముప్పు
- మరో 'అన్నమయ్య డ్యాం' కాకముందే స్పందించాలి
- సాగునీటి నిపుణులు, రైతుల వినతులు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల మనుగడ ప్రమాదంలో పడింది. జగన్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం కారణంగా ఇప్పటికే కడప జిల్లాలో అన్నమయ్య డ్యాం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అక్కడో ప్రాజెక్టు ఉందనే ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో గాజులదిన్నె జలాశయానికీ అలాంటి ముప్పే పొంచి ఉంది. ప్రాజెక్టు ఆధునీకరణ, మరమ్మతుల్లో భాగంగా కొత్త గేట్లు బిగించారు. అయితే వాటి నిర్వహణకు వీలుగా రోప్స్, లైనాప్ ప్లేట్లు వంటివి ఏర్పాటు చేయలేదు. డ్యాం ఎగువన వర్షాలు పడుతున్నాయి. వరద పోటెత్తితే గేట్లు ఎత్తే అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టుకు ప్రమాదం తప్పదని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు జగన్ ప్రభుత్వంలో రూ.30 కోట్లు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలలు క్రితమే కాంట్రాక్టరు చేతులెత్తేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించకపోతే గాజులదిన్నె కూడా అన్నమయ్య ప్రాజెక్టు తరహాలో ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ జిల్లాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో కర్నూలు జిల్లా గాజులదిన్నె (దామోదరం సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు ఒకటి. కర్నూలు జిల్లా గోనేగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ, డోన్ మండలాల్లోని పలు గ్రామాల్లో రబీ పంటలకు 24,372 ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరం, కృష్ణగిరి, డోన్ పట్టణాలతో పాటుగా 125 గ్రామాలకు తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారానే అందుతోంది. బండగట్టు రక్షిత మంచినీటి పథకం ద్వారా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 గ్రామాలకు పైగా తాగునీరు అందించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా కాలువ నుంచి 3 టీఎంసీల నీటిని కేటాయించారు. దీంతో జలాశయం సామర్థ్యం 7.5 టీఎంసీలకు పెంచాలనే లక్ష్యంగా రూ.108 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ తర్వాత జగన్ ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సవరించి 5.5 టీఎంసీల సామర్థ్యానికి పెంచుతూ రూ.37 కోట్లతో ఆనకట్ట బలోపేతం, ఎత్తు పెంచడం వంటి పనులు చేపట్టారు. మరో రూ.12కోట్లతో కొత్త గేట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులను బీఎస్‌వీ కన్‌స్ట్రక్షన్, శ్రీశ్రీ విఙ్ఞేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థలు దక్కించుకోగా.. విజయవాడకు చెందిన కాంట్రాక్టరు కోటిరెడ్డి సబ్ కాంట్రాక్టు తీసుకుని 2022 ఏప్రిల్ 26న పనులు చేపట్టారు.



ప్రాజెక్టుకు కొత్తగా ఏర్పాటు చేసిన గేట్లు

భారీ వరదొస్తే తిప్పలే

గాజులదిన్నె ప్రాజెక్టు ఆరు గేట్ల డిశ్చార్జ్ కెపాసిటీ (వరద విడుదల సామర్థ్యం) 80 వేల క్యూసెక్కులు. ఈ గేట్లకు దశాబ్దాలుగా మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపట్టాయి. నిర్వహణ కష్టంగా మారింది. కొత్త గేట్ల ఏర్పాటులో భాగంగా 2023 సెప్టెంబరులోనే ఫ్యాబ్రికేషన్ (తయారీ), ఎరక్షన్ (పాతవాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చడం) వంటి పనులు పూర్తి చేశారు. వాటిని కిందకు, పైకి ఎత్తేందుకు(లిఫ్ట్) వీలుగా రోప్ కనెక్షన్లు, లైనాప్‌ప్లేట్స్ వంటి కీలకమైన పనులు చేయాల్సి ఉంది. చిన్న పనులే అయినా గేట్ల నిర్వహణలో ఇవే కీలకం. ఆనకట్ట బలోపేతం, గేట్ల ఏర్పాటు పనులకు దాదాపు రూ.30 కోట్ల మేర బిల్లుల చెల్లింపునకు జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు చేయలేనంటూ కాంట్రాక్టరు చేతులెత్తేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. రుతుపనాలు ఆశాజనకంగా ఉండటంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. కాగా ఆదివారం (9వ తేదీ) నాటికే 97.9 మి.మీ. కురిసింది. 3శాతం అధిక వర్షపాతం నమోదైంది. జలాశయం ఎగువన పత్తికొండ మండలంలో 89.9 మి.మీ.కు గానూ 154.6 మి.మీ. (72% అధికం), ఆలూరు ప్రాంతంలో 77.5 మి.మీ.కు గానూ 108.2 మి.మీ.(40% అధికం), మద్దికెర మండలంలో 70.2 మి.మీ.కు గానూ 77.4 మిల్లీమీటర్లు (10% అధికం) వర్షం పడింది. రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అదే జరిగితే డ్యాంకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఎఫ్ఆర్ఎల్ లెవల్ దాటి వరద పోటెత్తితే గేట్లు ఎత్తాల్సి వస్తుంది. కొత్తగేట్లకు రోప్స్, లైనాప్ ప్లేట్ల పనులు చేయకపోవడంతో ఆనకట్టకు గండి కొట్టకపోతే కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. కడప జిల్లాలో 2022 నవంబరులో అధిక వరద అన్నమయ్య ప్రాజెక్టుకు పోటెత్తడంతో ఒక గేటు రోప్ తెగిపోయి అడ్డంగా ఇరుక్కుపోవడంతో పైకి ఎత్తలేని పరిస్థితి. సామర్థ్యానికి మించి వరద రావడంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. అలాంటి పరిస్థితులు రాకముందే గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తిచేసి నిర్వహణకు అనుకూలంగా రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

తక్షణమే మరమ్మతులు చేపడతాం

గాజులదిన్నె ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం. రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. భారీ వరదలు వస్తే ఆనకట్టకు ప్రమాదం ఉన్న మాట నిజమే. కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి తక్షణమే మిగిలిన పనులు చేయిస్తాం. ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

\- కబీర్‌బాషా, సీఈ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, కర్నూలు



వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తి 99 కోట్లు

- అసెంబ్లీలో 79% మంది నేరచరితులే
- 138 మందిపై క్రిమినల్ కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాజాగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో 138 (79%) మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 98 మందిపై సీరియస్ క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మొత్తం ఎమ్మెల్యేల్లో 162 మంది సంపన్నులు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 174 మంది అఫిడవిట్లను విశ్లేషించిన ఏడీఆర్ శనివారం ఓ నివేదిక విడుదల చేసింది. టీడీపీ తరఫున పుట్టపర్తి ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె సింధూర రెడ్డి అఫిడవిట్‌ను విశ్లేషించలేదు. 2019లో ఎమ్మెల్యేలుగా గెలిచినవారిలో 96 (55%) మందిపై క్రిమినల్ కేసులుండగా ఈసారి వారి సంఖ్య మరింత పెరిగింది. ముగ్గురిపై హత్య, 32మందిపై హత్యయత్నం కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. 22మందిపై మహిళలపై దాడులకు పాల్పడిన కేసులు ఉండగా, ఒక ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదైంది. పార్టీలవారీగా చూస్తే టీడీపీ తరఫున గెలిచిన 134మంది ఎమ్మెల్యేలలో 115 మంది, బీజేపీ టికెట్‌పై గెలిచిన 8 మంది, జనసేన తరఫున విజయం దక్కించుకున్న 10 మంది, వైసీపీ తరఫున గెలిచిన ఆరుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. సీరియస్ క్రిమినల్ కేసులు నమోదైన వారిలో టీడీపీలో 82మంది, బీజేపీలో ఐదుగురు, జనసేనలో ఏడుగురు, వైసీపీలో నలుగురు ఉన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేల ఆస్తులే ఎక్కువ

గత అసెంబ్లీ ఎన్నికలలో 163 మంది కోటీశ్వరులు గెలవగా ఈసారి 162మంది గెలిచారు. టీడీపీలో 127, జనసేనలో 18, వైసీపీలో 9, బీజేపీలో 8 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులేనని ఏడీఆర్ తెలిపింది. ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ ఈసారి రూ.65.07 కోట్లు ఉండగా, గత అసెంబ్లీలో రూ.27.87 కోట్లుగా ఉంది. టీడీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.67.97 కోట్లు ఉండగా, వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.99.19 కోట్లుగా ఉంది. బీజేపీ శాసనసభ్యుల సగటు ఆస్తుల విలువ రూ.34.29 కోట్లు, జనసేన ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.40.43 కోట్లుగా ఉంది.

- టీడీపీ అధినేత చంద్రబాబు రూ.931 కోట్ల ఆస్తితో అగ్రస్థానంలో ఉన్నారు. రెండోస్థానంలో నారాయణ రూ.824 కోట్లు, వైఎస్ జగన్ రూ.757 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు.
- మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎం. ఎస్ రాజుకు అందరికంటే అతి తక్కువగా రూ.12 లక్షల ఆస్తి ఉంది.
- రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీష రూ.19 లక్షలు, కర్నూల్ ఎమ్మెల్యే జయసూర్యకు రూ.21 లక్షల ఆస్తులున్నాయి.
- పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ కుటుంబ ఆదాయం దాదాపు రూ.73 కోట్లు ఉంది.
- విద్యార్హతల వారీగా చూస్తే.. 49 మంది ఎమ్మెల్యేలు 5 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు.
- 122 మంది డిగ్రీ ఆపై ఉన్నత విద్యావంతులు. ముగ్గురు డిప్లొమా చేశారు.
- వయసుల వారీగా చూస్తే.. 12 మంది 25-40 ఏళ్ల మధ్య 118 మంది 41-60 ఏళ్ల మధ్య. 43 మంది 61-80 ఏళ్ల మధ్య ఉన్నారు. ఒక ఎమ్మెల్యే వయసు 82 ఏళ్లు.

సీఐడీ ఆధీనంలో 'బేవరేజెస్'

- కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు
- ఫైళ్లు క్షుణ్నంగా పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో జరిగిన అవకతవలను నిగ్గుతేల్చేందుకు సీఐడీ దూకుడు పెంచింది. రెండు రోజులుగా విజయవాడ ప్రసాదంపాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు చేస్తోంది. బేవరేజెస్ ఎండీ కార్యాలయం మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోపిడీయే లక్ష్యంగా ప్రభుత్వ షాపుల ద్వారా అమ్మకాలు సాగించి, కమీషన్లు కొల్లగొట్టిన వైనంపై విచారణ చేస్తోంది. ఇష్టానుసారం ధరలు పెంచేసి, కమీషన్ల రూపంలో వేల కోట్లు దండుకున్న వ్యవహారంలో ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఐదు అంతస్తులున్న భవనంలో మొదటి రెండు ఫ్లోర్లు ఎక్సైజ్ కార్యాలయంగా వాడుకుంటున్నారు. పై మూడంతస్తులు కార్పొరేషన్‌కు సంబంధించినవి. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయానికి వచ్చి ఫైళ్లు తీసుకెళ్లినట్లు ఫిర్యాదు అందడంతో ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సీఐడీ సోదాలు చేపట్టింది. అక్కడినుంచి వచ్చిన తర్వాత బేవరేజెస్ ఎండీ కార్యాలయాన్ని సీజ్ చేసింది. బయట పోలీసుల్ని కాపలా పెట్టి సీఐడీ అధికారులు లోపల సోదాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సోదాలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో ఒక బాక్సు(కేసు) లిక్కర్‌పై రూ.250, బీరు కేసుపై రూ.150 చొప్పున వసూళ్లు చేసినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నారు. ఏడాదికి నాలుగు కోట్ల కేసులకు తగ్గకుండా ఐదేళ్లలో 20 కోట్ల కేసుల మద్యం విక్రయించి వేల కోట్లు దండుకున్న అక్రమార్కులను గుర్తించే పనిలో ఉన్నారు. కమీషన్ల రూపంలో దోచుకున్న వేల కోట్లలో జగన్‌కు వాటా వెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఆ డబ్బు దాచి, అందులో కొంత ఎన్నికల్లో ఖర్చు చేశారని, మిగిలిన డబ్బంతా బెంగళూరుకు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు ఇలా..

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 2019 అక్టోబరులో ప్రభుత్వ మద్యం షాపుల్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3500 మద్యం షాపులను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. మద్యం షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలనేది ప్రభుత్వమే నిర్ణయించేది. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని మద్యం కంపెనీలకు వైసీపీ పెద్దలతో ప్రతిపాదన పెట్టించింది. ఇందుకు కంపెనీలు అంగీకరించలేదు. దీంతో... 'మీకు నష్టం జరగకుండా మద్యం ధర పెంచుతాం. ఆ పెంచిన ధరను తిరిగి కమీషన్ రూపంలో ఇవ్వండి' అనే విధానం తెచ్చారు. అందుకు కొన్ని కంపెనీలు అంగీకరించాయి. ప్రముఖ బ్రాండ్ల ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం ఒప్పుకోలేదు. దీంతో ఆయా కంపెనీల బ్రాండ్లను షాపుల్లో విక్రయించడం ఆపేశారు. 2020 జనవరి నుంచి వైసీపీ ప్రభుత్వ మద్యం షాపుల్లో జగనన్న బ్రాండ్లను విక్రయించింది. అలా అమ్మిన ప్రతి లిక్కర్ కేసు నుంచి వైసీపీ పెద్దలకు ముడుపులు అందాయి. గత ఐదేళ్లలో అమ్ముడైన లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలు వ్యవహారాన్ని హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి మొత్తం సీజ్ చేయడంతో దుకాణాన్ని బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ పెద్దల సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్రంగా వ్యవహరించారు. ఆ తర్వాత అనేక మంది వచ్చారు. సీఐడీ వీరందరికీ నోటీసులు పంపి విచారించే అవకాశం ఉంది. మద్యం బాటిళ్ల కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా 5 వేల కోట్లకు పైగానే దోపిడీ చేసినట్లు తెలుస్తోంది.

రెండు రాష్ట్రాల్లో ఎంత తేడా...

మేన్షన్ హౌస్ బ్రాందీ 180మి.లీ. క్వార్టర్ బాటిల్ కేసు (48 సీసాలు) ఏపీ బేవరేజెస్ కంపెనీల నుంచి రూ.1697కు కొనుగోలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం దాన్ని రూ.1094కు తీసుకుంది. అంటే ఓ కేసు ధరలో వ్యత్యాసం రూ.603. ఈ మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు అనధికారికంగా చేరినట్టు ఆరోపణలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వం మద్యం షాపుల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌ను రూ.220కి విక్రయించగా, తెలంగాణలో రూ.170కే అమ్మారు. ఇలా పేదలకు అధిక ధరలకు మద్యం అంటగట్టి వేల కోట్లు వెనకేసుకున్నారు.

వాసుదేవరెడ్డి నుంచి సజ్జల దాకా..

జగన్ పాలనలో మద్యం దోపిడీ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో పలువురు కీలకంగా పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకు మాత్రమే ఎండీ వాసుదేవరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డర్లు వెళ్లేవి. తమకెందుకు ఇవ్వరని ఇతర ఉత్పత్తిదారులు ప్రశ్నిస్తే.. ఏదో మమ అనిపించేవారు. ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, వాటిని ఎవరూ కొనట్లేదని వెనక్కి పంపేవారు. ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలన్నది సజ్జల రామకృష్ణారెడ్డి నిర్ణయించేవారు. ప్రతిరోజూ ఉదయం సజ్జల నుంచి బ్రాండ్ల చార్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు వెళ్లేది. ఆయన దాన్ని మద్యం డిపో మేనేజర్లు, షాపుల్లో సేల్స్‌మెన్‌కు పంపేవారు. దాని ప్రకారం మద్యం విక్రయించేవారు. మద్యం కంపెనీలకు బకాయిల విడుదల వ్యవహారాలను కార్పొరేషన్‌లో పదవీ విరమణ చేసిన వేణుగోపాల్ చూసేవారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ తీసుకుని బకాయిలు విడుదల చేసేవారు. మరో రిటైర్డ్ అధికారి శ్రీనివాసరెడ్డి 3నెలలుగా స్టాకు అమ్ముడుపోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా కంపెనీల నుంచి గ్రౌండింగ్ చార్జీలు వసూలు చేశారు.

బెట్టింగులే బలిగొన్నాయా?!

- అనుమానాస్పద స్థితిలో వైసీపీ నాయకుడి మృతి
- ఎన్నికల ఫలితాల రోజు నుంచి అజ్ఞాతంలోనే..

నూజివీడు టౌన్, జూన్ 9: ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పుదిగవల్లి వైసీపీ నాయకుడు జగ్గవరపు వేణుగోపాలరెడ్డి ఆదివారం అనుమానాస్పద స్థితిలో తన మామిడి తోటలోని షెడ్డు వద్ద మృతి చెందారు. తూర్పు దిగవల్లి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి భర్త అయిన వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీల గెలుపు, ఓటములపై పలు బెట్టింగ్‌లకు మధ్యవర్తిగా వ్యవహరించినట్టు సమాచారం. దాంతో పాటు తాను సైతం భారీగా బెట్టింగులు కాసి డబ్బు కోల్పోయినట్టు చెప్పుకొంటున్నారు. దాదాపు 30 కోట్ల రూపాయల వరకు ఎన్నికల బెట్టింగుల్లో మధ్యవర్తిగా లేదా ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల రోజు నుంచి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు కనిపించలేదు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం పలువురు పందెం రాయుళ్లు వేణుగోపాల్‌రెడ్డి ఇంటిపై దాడి చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున అతడు తన మామిడి తోటలోని షెడ్డు వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండడంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.



వేణుగోపాల్‌రెడ్డి



జిమ్‌కు తిరిగి ఎన్టీఆర్ పేరు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్, సాయి తదితరులు


మళ్లీ 'ఎన్టీఆర్ జిమ్'గా..

- గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో వైసీపీ శిలాఫలకాల ధ్వంసం
- వందలాదిగా పాల్గొన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు
- 'ఎన్టీఆర్'ని టచ్ చేస్తే తీవ్ర పరిణామాలు: బ్రాహ్మణ చైతన్య వేదిక

గుంటూరు, జూన్ 9: గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ జిమ్ పేర్లను మార్చేందుకు గత వైసీపీ పాలకులు చేసిన కుట్రలను బ్రాహ్మణ చైతన్య వేదిక భగ్నం చేసింది. ఆ మేరకు స్టేడియంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం ధ్వంసం చేశారు. స్టేడియంలోని జిమ్ నూతన భవనంపై 'ఎన్టీఆర్ జిమ్' అంటూ భారీ అక్షరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ మాట్లాడుతూ ఎవరైనా అన్న ఎన్టీఆర్ పేరును టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ స్టేడియంను వైఎస్సార్ స్టేడియంగా పేరు మార్చేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులతో అధికారులు కుట్రపన్నారన్నారు. అందుకోసమే స్టేడియంలో నూతన భవన నిర్మాణం చేపట్టి వైఎస్సార్ జిమ్‌గా పేరు పెట్టేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని మండిపడ్డారు. దీనిపై తాము హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని, అయినా.. మున్సిపల్ అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై నిర్మాణ పనులు ఆపకుండా అక్రమంగా కొనసాగించారని విమర్శించారు. హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉన్నా, ఎన్నికల కోడ్ ఉన్నా అప్పటి మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు వైఎస్సార్ పేరుతో శిలాఫలకాలు ప్రారంభించేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. దీనిపైనా తాను హైకోర్టులో మరో పిల్ వేయగా వైసీపీ ప్రజా ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. భవన నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.49 లక్షలు కేటాయించినట్లుగా చూపి ప్రజాధనాన్ని నొక్కేశారని, నూతన ప్రభుత్వం తక్షణమే ఆడిట్ జరిపించి ఆ డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు.

బలమైన ప్రతిపక్షంతోనే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం!

- వచ్చే ఐదేళ్లు కేంద్రంలో మంచి పాలన: రజినీకాంత్
- చంద్రబాబు ఆహ్వానిస్తే ప్రమాణస్వీకారానికి వెళతానని వెల్లడి



చెన్నై, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బలమైన ప్రతిపక్షాన్ని ప్రజలు ఎన్నుకొన్నారని, ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతమని తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఢిల్లీకి బయలుదేరిన ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఐదేళ్లు కేంద్రంలో ఎలాంటి పాలన ఉంటుందని భావిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా, మంచి పాలన ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికైన ఘనతను మోదీ సాధించారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమానికి తనను ఆహ్వానిస్తే తప్పకుండా హాజరవుతానని రజినీకాంత్ తెలిపారు.

నవ్య

కుటుంబ కదంబం

పెళ్లి తరువాత చాలామంది మహిళలు ఇళ్లకే పరిమితమై పోతారు. జ్యోతి శ్రీవాస్తవ పరిస్థితీ అదే. ఇంజనీరింగ్ చదివి... రాకెట్లు డిజైన్ చేసిన ఆమె కెరీర్... వివాహం అయ్యాక అమాంతం ఆగిపోయింది. కానీ బిడ్డ పుట్టాక... ఆమె ఆలోచనే మారిపోయింది. ఒక తల్లిగా గడించిన అనుభవాన్ని... ఫుడ్ బ్రాండ్‌గా మార్చి... పారిశ్రామికవేత్తగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నేడు ఎందరో తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆ తల్లులకు వందనం

"అశోక విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం... 73 శాతం మంది భారతీయ మహిళలు మొదటి బిడ్డ పుట్టాక ఉద్యోగం వదిలేస్తున్నారట. ఆ నివేదిక చదివాక ఆశ్చర్యం అనిపించింది. ఇల్లు, పిల్లలు, బాధ్యతలంటూ ఆడవారు తమ కెరీర్ గురించి ఆలోచించడంలేదు. వెనక్కి తిరిగి చూసుకొంటే... నా పరిస్థితీ అదే. మా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా భారత సైన్యం కోసం రాకెట్లు డిజైనింగ్ చేశాను. అది నాకు ఎంతో ఇష్టమైన కొలువు. దాని కోసం నానోటెక్నాలజీ, రాకెట్ ప్రొపెల్లెంట్స్‌లో స్పెషలైజేషన్ చేశాను. అయితే అక్కడ విపరీతమైన పని. క్షణం తీరిక దొరికేది కాదు. జీతం మాత్రం చాలా తక్కువ. పనికి... జీతానికి పొంతన లేదు. దాంతో రెండున్నరేళ్ల తరువాత, అంటే 2018లో ఉద్యోగం వదిలేశాను. అనంతరం ఫ్రీలాన్సర్‌గా కొన్ని వాయుసేన ప్రాజెక్ట్‌కు పని చేశాను. ఎందుకో అది కూడా నాకు సంతృప్తినివ్వలేదు. అదే సమయంలో నాకు పెళ్లయింది. కొన్నాళ్లు ప్రాజెక్ట్ కొనసాగించాను.

అనుభవం నుంచి...

ఏడాది తరువాత నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు మొదలయ్యాయి నా కష్టాలు. పుట్టబోయే బిడ్డ కోసమే కాదు... నా గురించి కూడా నేను శ్రద్ధ తీసుకోవాలి కదా. అందుకే ప్రాజెక్ట్ అన్నీ పక్కన పెట్టేశాను. బాబు పుట్టాడు. తల్లి పాలు పట్టే విషయంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత వాడికి అందించే ఆహారం విషయంలోనూ అయోమయం. ఒక తల్లిగా పిల్లాడికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనేది నా తపన. చిరుధాన్యాల్లో అయితే పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కొన్ని రోగాలను నయం చేసే శక్తి కూడా వాటిల్లో ఉందని అర్థమైంది. తల్లి పాలలోని గుణాలు ఇందులోనూ ఉన్నాయి. మిల్లెట్స్ పిల్లల ఎదుగుదలను గణనీయంగా పెంచుతాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వీటన్నటి నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ప్రత్యేక కోర్సులు చదివి...

బిడ్డ పోషణకు సంబంధించి పూర్తి అవగాహన కావాలి. అందు కోసం యునిసెఫ్ 'ఐవైసీఎఫ్' (ఇన్‌ఫ్యాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్) కోర్సు చదివాను. దాంతోపాటే 'చైల్డ్ అండ్ మెటర్నల్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత నాలాంటి తల్లులకు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో 'లిటిల్ చెర్రీ మామ్' పేరుతో పేజీ ఒకటి తెరిచాను. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నాకు ఫుడ్ ప్రాసెసింగ్ మీద అవగాహన ఉంది. భారీ ప్రాజెక్టులకు పని చేసిన అనుభవం ఉంది. అందుకే ఎవరో తెలిసీ తెలియక అన్న మాటలు నేను పట్టించుకోలేదు. నేను అందించే సమాచారం కొందరు చంటి బిడ్డల తల్లులకైనా చేరితే చాలనుకున్నాను.

> ఆరంభంలో కొందరు నన్ను ఎగతాళి చేశారు. హేళనగా మాట్లాడారు. 'ఈమెకేం తెలుసు' అన్నట్టు కొందరు బంధువుల, స్నేహితులు నా మీద జోక్‌లు వేశారు. 'నాడు మంచి ఉద్యోగం వదిలి తప్పు చేశావు' అన్నారు. అవేవీ పట్టించుకోలేదు.



మా అబ్బాయి పేరుతో...

పసి పిల్లల ఎదుగుదలకు సంబంధించి ఆయుర్వేదంలో పేర్కొన్న వివిధ రకాల మూలికల గురించి కూడా చదివాను. వాటి ఔషధ గుణాలకు సంబంధించిన సమాచారం సేకరించి పెట్టుకున్నా. వీటన్నిటినీ క్రోడీకరించి, మిల్లెట్స్‌తో రోజుకు మూడు రకాల వంటలు ప్రయత్నించాను. పోషక విలువలే కాదు, రుచి కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఎందుకంటే రుచికరంగా లేకపోతే పిల్లలు ముట్టుకోరు. అలా కొన్ని రెసిపీలు సిద్ధమయ్యాక మా అబ్బాయి పేరుతో చిరుధాన్యాల ఆధారిత 'లిటిల్ చెర్రీ ఫుడ్స్' కంపెనీ ప్రారంభించాను. చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలు ఉన్న, తాజా ఆహారం అందించాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పాను.

సవాళ్లు ఎదురైనా...

ఒకానొక దశలో ఇక నా వృత్తిగత జీవితం ముగిసిపోయిందని అనుకున్నా. ఆ సమయంలోనే ఇన్‌స్టాలో నేను పెట్టిన పోస్ట్‌లకు క్రమంగా వీక్షకులు పెరిగారు. కొద్ది రోజుల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. అది నాకు నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహంతోనే కంపెనీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? అది పెద్ద సమస్యగా మారింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మావారు నాకు అండగా నిలిచారు. కొంతవరకు ఆర్థిక వనరులు సమకూర్చారు. మిగిలిన పెట్టుబడి కోసం నేను ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. కానీ ఇంకా లోటు. దాంతో బ్యాంకు లోను తీసుకొని వ్యాపారం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని నవజాత శిశువుల తల్లులకు చేరువయ్యే ప్రయత్నం చేశాను. తొలి విడత ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసే నాటికి మావద్ద యాభై వేల పైచిలుకు తల్లులతో కూడిన అతిపెద్ద సమూహం ఒకటి ఏర్పడింది. ఆ తరువాత నా పని సులువైంది. కష్టానికి ఫలితం దక్కింది. ఏడాది తిరక్కుండానే మా బేబీ ఫుడ్స్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు మా టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. నేటికీ మిల్లెట్ ఫుడ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. సంపాదన, సంతృప్తి... రెండూ దక్కుతున్నాయి. ఇదంతా అంతమంది తల్లులు నాపై ఉంచిన నమ్మకం. ఆ తల్లులందరికీ నా వందనం."

మార్పు యోధులు...

వారియర్స్ వితవుట్ ఎ కాజ్...

పేదలకు, అణగారిన వర్గాలకు ఏదైనా మేలు చేద్దామనే తపనతో నలుగురు కాలేజీ అమ్మాయిలు ఏర్పాటు చేసిన ఈ ఎన్జీవో.. ఇప్పుడు మూడువందల మందికి పైగా వాలంటీర్లతో... దేశంలోని వివిధ నగరాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్పందించే మనసుంటే... సాయం చెయ్యడానికి వయసుతో, ఆర్థిక స్థాయితో సంబంధం లేదని నిరూపిస్తోంది ఈ యువ బృందం.



2020... జన జీవనంలో కొవిడ్ మహమ్మారి రేపిన అల్లకల్లోలాన్ని చూసి చలించిపోయారు అనూష అత్రి, భవానీ సింగ్, ఖుషీ సింగ్, వంశికా మెహతా. ఆ నలుగురు అప్పుడే టీనేజీ దాటిన స్నేహితులు. ఢిల్లీలో చదువుకుంటున్నారు. కనీస అవసరాలు తీరక అల్లాడిపోతున్న ప్రజానీకానికి తమ వంతుగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. తమ పాకెట్ మనీని పోగేసి... మాస్కులు, శానిటైజర్లు కొని... మురికివాడల ప్రజలకు పంచిపెట్టారు. ఆ తరువాత నిత్యావసరాలను కూడా అందించారు. ఈ క్రమంలో... ఆ ప్రజల అత్యవసరాలను ప్రత్యక్షంగా గమనించి, అర్థం చేసుకున్నారు. సామాజిక సంక్షేమం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, రిజిస్టర్ చేశారు. అదే 'వారియర్స్ వితవుట్ ఎ కాజ్'. "ఒక మార్పు తేవడానికి మనం దోహద పడడం వెనుక ఎలాంటి కారణం ఉండవలసిన అవసరం లేదనేది మా ఉద్దేశం. తోటివారి కష్టాలకు స్పందించి, వారికి సాయం చేసే సున్నితత్వం సమాజంలో పెరగాలి. ఆ దిశగా చైతన్యాన్ని వ్యాప్తి చెయ్యాలని, దీర్ఘకాలంలో... పేద వర్గాలను వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలని అనుకున్నాం. మురికివాడల్లో మా ప్రయత్నాన్ని ప్రారంభించాం" అని వివరించారు ఆ ఫ్రెండ్స్. కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాకుండా... వైద్య శిబిరాల ఏర్పాటు, ఎడ్యుకేషన్ వర్క్‌షాపుల నిర్వహణ, శానిటరీ ప్యాడ్స్, ఆహారం, దుస్తులు, స్టేషనరీ, పుస్తకాల్లాంటివాటి పంపిణీతో సహా... విస్తృతమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

"అవసరాలు తీర్చడం, ఆసరాగా నిలబడడం, విద్యకు, ఉపాధికి సహకారం అందించడం... ఇవీ మా ప్రాధాన్యాలు. అదే సమయంలో మౌలిక సదుపాయాలను, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అందుబాటులోకి తేవడం కూడా దీనిలో భాగం. మొత్తంగా వారి జీవన నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తున్నాం" అని వారు చెబుతున్నారు. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం, ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు ఢిల్లీలోని సిఆర్ఆర్ఐ మురికివాడలో కుట్లు, అల్లికలు లాంటి విషయాల్లో దాదాపు ముప్ఫై మంది మహిళలకు ఈ ఎన్జీవో శిక్షణనిచ్చి.. ఉత్పత్తులు తయారు చేయిస్తోంది. వాటిని మార్కెట్లలో, ఎగ్జిబిషన్లలో విక్రయించి... ఆ మహిళలకు శాశ్వతమైన ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. వీధి వర్తకులకు, చిన్న బండ్ల మీద సరుకులు అమ్ముకొనేవారికి ఎండ తీవ్రత నుంచి ఊరట కలిగించడానికి... కిందటి ఏడాది ఈ ఫ్రెండ్స్ ప్రారంభించిన 'బీట్ ది హీట్' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా... పెద్ద గొడుగులు, టోపీలు, శీతల పానీయాలు, నీరు పంపిణీ చేస్తున్నారు. "వివిధ ప్రాంతాల్లో యాభైవేల మందికి వాటిని అందజేశాం. ఈ ఏడాది ఇప్పటికే అయిదు వేలమందికి పైగా ప్రయోజనం పొందారు. మరెంతో మందికి మా సేవలు అందించాల్సి ఉంది. దీనిలో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేస్తున్నాం" అని చెబుతున్న 'వారియర్స్' ద్వారా గత మూడేళ్ళలో వివిధ సాయాలు అందుకున్నవారి సంఖ్య నాలుగు లక్షలకి పైనే.

నవ్య | చిత్రజ్యోతి

ఈ పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకం



వెండి తెరపై 'సమరసింహ'మైన బాలకృష్ణ విశ్వరూపం చూసి అభిమానులు ఏనాడో తరించి పోయారు. ఆ హోరులో బాక్సాఫీస్ వసూళ్ల పండగ చేసుకుంది. ఆ తాకిడికి రికార్డులు దాసోహం అయ్యాయి.. బాలయ్య చేతిలోని ఆయుధమే కాదు కంటి చూపు, మాట కూడా పదునే... అందుకే ఈ నట 'సింహా'నికి జనం నీరాజనాలు పట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెడితే అక్కడ కూడా ఆయన్ని ఘనంగా ఆదరించారు. మూడో సారి కూడా ఆయన్ని శాసన సభ్యుడిగా గెలిపించి హ్యాట్రిక్ వీరునిగా నిలబెట్టారు. ఒక సినీ హీరో ఇలా వరుసగా మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం చరిత్రలో ఇదే ప్రథమం. అంతకు ముందు ఎన్టీఆర్‌కు ఇటువంటి రికార్డ్ ఉన్నా ఆయన సినిమాల నుంచి రాజకీయ రంగంలోకి వెళ్లిన తర్వాత ఆ ఘనత సాధించారు. కానీ సినీ రంగంలో ఉంటూనే రాజకీయ రంగంలో కూడా రికార్డులు క్రియేట్ చేసిన ఏకైక హీరో బాలయ్యే. శాసన సభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో వస్తున్న పుట్టిన రోజు (జూన్ 10) కావడంతో ఈ రోజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది.

తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వంలో 'తాతమ్మ కల' (1974) చిత్రంతో ప్రారంభమైన బాలకృష్ణ చలన చిత్ర యాత్ర ఇంకా నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఆయనతో నటన ప్రారంభించిన హీరోలు, తర్వాత వచ్చిన వారూ మధ్య మధ్యలో గ్యాప్ తీసుకున్నా బాలయ్య మాత్రం ఆగిపోలేదు, అలసిపోలేదు. ఈ ఐదు దశాబ్దాల నట జీవితంలో భారీ విజయాలే కాదు..కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి.. అపజయానికి కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుకుతూ రాజీ పడలేదు.



భారతీయ నట వారసుల్లో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకత వేరు.. తన సమకాలిక హీరోలు సాంఘిక చిత్రాలకే పరిమితం కాగా పౌరాణిక, జానపద, చారిత్రక, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో సైతం బాలకృష్ణ నటించి తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు.

తెలుగు భాష పట్ల బాలకృష్ణకు ఎంతో గౌరవం. స్వచ్ఛమైన ఉచ్చారణతో, తెలుగుతనం ఉట్టి పడే పదాలతో ఆయన డైలాగులు చెప్పే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ నందమూరి అందగాడు ముఖ కవళికల్లో, అనర్గళంగా సాగే మాటల్లో పౌరుషం శివమెత్తి నాట్యం చేస్తుంటుంది. అందుకే బాలయ్య డైలాగులు అంటే ఫ్యాన్స్ లో అంత క్రేజ్.. ఇక ఆయన కత్తి పట్టి రంగంలోకి దిగితే యాక్షన్ పంట పండినట్లే. తనకు ఉన్న ఇమేజ్‌కి భిన్నంగా నిజ జీవితంలో బాలకృష్ణ వ్యవహరిస్తుంటారు. నలుగురిలో మామూలుగా కనిపిస్తే హీరోగా తన ఇమేజ్ దెబ్బ తింటుందేమో అనే అభద్రత భావం బాలయ్యలో బొత్తిగా కనిపించదు. తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం ఆయనకి ఒక సరదా. అలాగే అందరితో జోవియల్‌గా మాట్లాడుతుంటారు.

క్రమశిక్షణ.. ముక్కుసూటి మనస్తత్వం

బాలకృష్ణ తండ్రిలాగే క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు. అలాగే ఆయన నిర్మోహమాటి. ముక్కుసూటి మనస్తత్వం కలవారు. నాన్చుడు వ్యవహారం ఆయనకి నచ్చదు. ఏ విషయమైనా వెంటనే తేల్చేయాల్సిందే. నటన అనేది ఒక ఉద్యోగంగా భావించకుండా ఓ కళగా ఆరాధించే వ్యక్తి కావడం వల్లే ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పనిచేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

రామోజీ సేవలు అజరామరం



అక్షర యోధుడు రామోజీరావు స్మృతికి నివాళిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని రామోజీరావు సేవలు అజరామరమని కొనియాడారు. నిర్మాత కేఎస్ రామారావు, చదలవాడ శ్రీనివాసరావు, స్రవంతి రవికిషోర్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్రప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., *Printed and Published* at "Aamoda Press" at 91, Wood Complex, Vedayapalem, Nellore, A.P., Tel. No.0861-2312299, Editor: **K.Srinivas**, RNI No. APTEL/2004/11742, **Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.

బీజేపీ శ్రేణుల సంబరాలు

కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడటంతో కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో పలుచోట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. మోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు.

కోవూరు జూన్ 9: కోవూరులో బీజేపీ నాయకులు విజయోత్సవం నిర్వహించారు. బజారు కూడలిలో ప్రధానమంత్రి మోదీని అభినందిస్తూ నినాదాలు చేశారు. మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. గాజుల చక్రవర్తి, పోలే పెద్ది సుబ్బారావు, ఏనేటి గౌతమ్ గౌడ్ పాల్గొన్నారు.


కోవూరులో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

బుచ్చిలో ర్యాలీ..

బుచ్చిరెడ్డిపాళెం: నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుచ్చి బస్టాండ్ సెంటర్లో సంబరాలు చేసుకున్నారు. స్థానిక బీజేపీ కార్యాలయం నుంచి బీజేపీ, టీడీపీ, జనసేన మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు ర్యాలీగా బయలుదేరి చెన్నూరు రోడ్డుమీదుగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.


పొదలకూరు : హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

వెంకటాచలంలో వేడుకలు

వెంకటాచలం: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. అనంతరం పెద్దఎత్తున బాణా సంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్‌నాయుడు, మండల ప్రధానకార్యదర్శి పిల్లిపాకుల పెంచలయ్య, నాయకులు బిరుదవోలు కరీముల్లా, తుమ్మాటి మాధవరావు, సండిబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొదలకూరులో సంబరాలు

పొదలకూరు : పట్టణంలోని కాకాణి రమణారెడ్డినగర్‌లో బీజేపీ సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, రాచపూటి ధనుంజయ రావు ఆధ్వర్యంలో మండల నాయకులు ఆదివారం బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, ప్రశాంత్, రాపూరు, బాబు, ఐతా రవి, రోహిత్, రాంబాబు, బ్రహ్మయ్య, శ్రీను, రెడ్డి, ఎం.పెంచలస్వామి, లక్ష్మణ్, రాఘవ, పుల్లారెడ్డి పాల్గొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు ముక్కు అయోధ్య రామయ్యగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

కోడూరు బీచ్‌లో పోలీసుల గస్తీ

తోటపల్లిగూడూరు, జూన్ 9: కోడూరు బీచ్, కాటేపల్లి సముద్ర తీరాన ఆదివారం బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ జంపానీకుమార్ తెలిపారు. పర్యాటకుల తాకిడి అధికంగా ఉండటంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆకతాయిలు పర్యాటకులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా వడాయతి ఉత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 9: మండలంలోని జొన్నవాడ ఆలయంలో కామాక్షితాయికి ఆదివారం వడాయతి ఉత్సవం వైభవంగా జరిగింది. కుంభహారతి మండపంలో ఏర్పాటుచేసిన ఊయలలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ఊరేగించారు.

ఆనంను కలిసిన 'కోన' సిబ్బంది

రాపూరు(డక్కిలి), జూన్ 9 : ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం పెంచలకోన ఆలయ ఏసీ సాగర్ బాబు, ప్రధాన అర్చకుడు రామయ్య స్వామి, మాజీ పాలకవర్గ సభ్యులు పీర్ల సోమయ్యలు కలిసి సత్కరించారు. స్వామి వారి పట్టు వస్త్రాలు అందచేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సైదాపురం, జూన్ 9: మండలంలోని కలిచేడు గ్రామం మైకా మైన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఉన్నత పాఠశాలలో 1986 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 38 ఏళ్ల తరువాత నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఆత్మీయ పలకరింపులు, మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు షేక్ మస్తాన్ సాహెబ్, బాలయ్య, రామారావులను శాలువా, పూలమాలలతో సన్మానించి గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకే చోటకు చేరడంతో సందడి నెలకొంది. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నెంబర్లు తీసుకోవడంతో పాటు మధుర జ్ఞాపకాలను వారి సెల్‌ఫోనుల్లో తీసుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంత మంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరి కొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, ఖాసీం, కొండా సురేష్, పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతుల గెలుపుతో ప్రత్యేక పూజలు

విడవలూరు, జూన్ 9 : సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం సాధించడంతో రామతీర్థం గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీహరికోట గోపి ఆదివారం దండిగుంట గ్రామంలోని పోతురాజుస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 101 టెంకాయలు కొట్టి తన మొక్కును తీర్చుకున్నారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులు గెలుపొందాలని పోతురాజు స్వామికి మొక్కుకున్నానని, ఆ స్వామి దయతో ఇరువురూ భారీ మెజార్టీతో గెలుపొందారని, అందువలన మొక్కును తీ ర్చుకున్నానని ఆయన తెలిపారు. అదేవిధంగా వేమిరెడ్డి దంపతుల్లో ఏ ఒక్కరికైనా కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మంత్రి పదవులు దక్కాలని స్వామివారిని కోరుకున్నామని ఆయన తెలిపా రు. దండిగుంట దళిత కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త నాగార్జున వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపొందిన సందర్భంగా కొడవలూరు రాజుపాలెంలోని నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. తన సొంత ఖర్చులతో అన్నదానం చేశారు.


దండిగుంటలో మొక్కు చెల్లించుకుంటున్న రామతీర్థం టీడీపీ నాయకులు

ప్రశాంతిరెడ్డికి టీడీపీ నేతల అభినందనలు

ఇందుకూరుపేట: కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆదివారం నెల్లూరులోని ఆమె నివాసంలో ఇందుకూరుపేట మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రచౌదరి కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, పేదూరు రామచంద్రయ్య, ఉదయ్ కుమార్, అవ్వారు ఏడుకొండలు, నరసయ్య, పోలయ్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కల్యాణ్‌రెడ్డిని కలిసిన మత్స్యకారులు

కోవూరు నియోజకవర్గంలో సముద్రతీర ప్రాంతాల్లోని మత్స్యకార గ్రామాలలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి భారీ మెజారిటీ రావడంతో ఆదివారం మత్స్యకారులు టీడీపీ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కృష్ణాపురం గ్రామంలో ఎన్డీఏ కూటమికి 769 ఓట్లు రాగా, వైసీపీకి 10 ఓట్లు మాత్రమే వచ్చాయి. 98శాతం మెజారిటీ రావడంపై కల్యాణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహ, మత్స్యకార నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు

సైదాపురం, జూన్9: సైదాపురంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి గుడిలో ఆదివారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ వరిగొండ సురేంద్ర ఆధ్వర్యంలో నాయకులు, కార్యక ర్తలు 501 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించడం హర్షణీయం అన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి

విడవలూరు, జూన్ 9 : జిల్లాలోని కల్లు గీత కార్మికులు, కుటుంబ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు కల్లుగీత సంక్షేమ సంఘం, సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఇటీవల దండిగుంట, వీరారెడ్డిపాలెం పంచాయతీల్లో కల్లుగీస్తుండగా గాయపడిన ఉప్పాల శ్రీని వాసులు, అన్నం శీనయ్య కుటుంబ సభ్యులను గౌడ సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఇరువురికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కోసూరు గోవిందయ్య స్థాపించిన సమితి ద్వారా జిల్లాలోని అనేక మంది కార్మికులకు ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా కల్లుగీత కార్మికులకు చెందిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో ఉత్తమ మార్కులు పొందిన వారికి ప్రోత్సహకాలు అందజేస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నెల్లూరులోని టౌనుహాలులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దండిగుంట టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున్‌గౌడ్, తూళూరు ఉదయ్‌గౌడ్, పోసిన కిష్టమ్మ, రావుల రంగయ్యగౌడ్, దాసరి వెంకటేశ్వర్లు గౌడ్, కోవూరు గోవింద గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న కల్లుగీత సంఘం నాయకులు

రామోజీరావుకి ఘన నివాళి

వెంకటాచలం, జూన్ 9: మీడియా దిగ్గజం, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావుకు చెముడుగుంట గ్రామస్థులు, యువతతో కలిసి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి రామోజీ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. రెండు నిమిషాలపాటు శ్రద్ధాంజలి ఘటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆ ప్రార్థించారు. కార్యక్రమంలో వేమిరెడ్డి మధురెడ్డి, దొడ్ల అశోక్, శ్రీనివాసులు, కుమార్, కళాధర్, సుబ్బారావు, ప్రసాద్, వినోద్, కృష్ణ, ఫయాజ్, వెంకటశేషయ్య, రాము, మల్లికార్జున్, సుబ్బయ్య, శ్రీను ఉన్నారు.


రామోజీరావుకు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

అక్షర యోధుడు రామోజీరావు

పొదలకూరు, జూన్ 9: అక్షర యోధుడు రామోజీరావు జీవితం అందరికీ ఆదర్శమని తెలుగుదేశం మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం వారు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామోజీరావు స్వయంకృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించారని కొనియాడారు. పత్రికా రంగంలో వినూత్న ఒరవడిని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదాల సుగుణమ్మ, మద్దిరెడ్ల నరసింహులు, గంటా మల్లి, జమీర్‌బాషా, ఖాదర్‌బాషా, వి.రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

- ఫ్లాట్ ఫారంపై మద్యం సీసాలు, గ్లాసులు
- చీకటి పడితే అరుపులు, బూతుపురాణాలు
- భయం గుప్పిట్లో సమీప నివాసితులు



నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్

సౌత్ రైల్వే స్టేషన్ అసాంఘికకాలకు అడ్డా!

నెల్లూరు(క్రైం), జూన్ 9: నెల్లూరు నగర నడిబొడ్డులో వీఆర్‌సీ కూడలికి పక్కనే ఉన్న సౌత్ రైల్వే స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ స్టేషన్ నుంచి ప్రతి రోజు వందలాది మంది ప్రజలు రైళ్లలో ఎక్కడం, దిగడం చేస్తుంటారు. అయినా ఈ స్టేషన్‌లో కనీస వసతులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. వసతుల విషయం పక్కన పెడితే ఈ స్టేషన్ నుంచి రైలు ఎక్కాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మందు బాబులు, గంజాయి, వైట్‌నర్, పె ట్రోల్ వంటివి సేవించి మత్తుకు బానిస లైన వారికి ఈ స్టేషన్ అడ్డాగా మారింది. దీంతో ప్లాట్‌ఫారమ్‌లపై మత్తులో ఊగిసలాడుతూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్న వారిని చూస్తున్న ప్రజలు భయంతో పరుగులు తీస్తున్నారు. చీకటి పడితే ఈ ప్రాంతంలో మందుబాబులు, ఆకతాయిలు చెలరేగి పోతున్నారు. పూటుగా మద్యం సేవించి ప్లాట్ ఫారంపై ఉన్న బెంచీలను ధ్వంసం చేయ డం, మద్యం సీసాలను పగలగొట్టడం, గొడవలు పడటం, గట్టిగా కేకలు వేయడం, బూతు పురాణాలు చేస్తుండటంతో రైలు ఎక్కేందుకు వచ్చిన ప్రజలతోపాటు ప్లాట్ ఫారం పక్కనే నివాసం ఉంటున్న ప్రజలు ఎప్పుడు ఏమి జరుగు తుందో అని భయపడుతున్నారు. పోలీసుల నిఘా పెద్దగా ఉండక పోవడం, రాత్రి పూట సైరన్ వేసుకుంటూ ప్లాట్‌ఫారమ్‌పై ఒక రౌండ్ వేసి పోలీసులు వెళ్లి పోతుండటం, రైల్వే పోలీసులు మాకెందుకులే అని అసలు పట్టిం చు కోక పోవడంతో సౌత్ రైల్వేస్టేషన్ ఆకతాయిలకు, అసాంఘికాలకు అడ్డాగా మారిపోయింది.


అండర్ బ్రిడ్జి కింద ఖాళీ మద్యం సీసాలు


మద్యం మత్తులో నిద్రిస్తున్న మందుబాబు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఓవెల్ యాజమాన్యం

నెల్లూరు(విద్య), జూన్ 9 : దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలతో పాటు పలు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీ చేసేందుకు రాసే ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో షేక్.సూరజ్ 134వ ర్యాంకు, వి.సుబ్రహ్మణ్య కళ్యాణరామ్ గణేష్ 1138, పి.సాయినితీష్ 1664, ఎ.శ్రీనితీష్ 1949, బి.రితేష్‌రెడ్డి 2177, ఎం.లావణ్య చంద్రిక 2554, ఓ.చక్రేష్ 2976, బి.శ్రీకాంత్ 3592, డి.రూపేష్ 3764, జె.చరిత సాయిసుష్మ 4050, ఎ.విరించి 4460, పి.విఘ్నేష్‌సిద్దు 4794, కె.మనోజ్‌కుమార్ రెడ్డి 4847వ ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు ఓపెన్ కేటగిరిలో 10వేల లోపు ర్యాంకులు 21మంది, 20వేల లోపు ర్యాంకులు 47మంది, 30వేల లోపు ర్యాంకులు 54మంది సాధించారన్నారు. అన్ని కేటగిరిల్లో 5వేల లోపు ర్యాంకులను 83మంది, 10వేల లోపు ర్యాంకులను 105 మంది సాధించారన్నారు. మొత్తం మీద 130 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించారన్నారు. విద్యాసంస్థలో సమష్టి కృషితో పాటు పటిష్టమైన మైక్రో షెడ్యూల్, బోధనా పద్ధతులు, పరీక్ష విధానాలతోనే ఈ ఫలితాలు సాధించామన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు, డీన్‌లు, ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్వసాయిలో విద్యార్థినిని అభినందిస్తున్న సత్యనారాయణ

విశ్వసాయి విజయం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విశ్వసాయి కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో విజయాలు సొంతం చేసుకున్నారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. నగరంలోని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో తమ కళాశాలకు చెందిన వై.శరణ్యేష్ 3430వ ర్యాంకు, ఎం.దివ్యశ్రీ 5333, ఎస్.కార్తిక్ 1430, బి.సిద్దార్థ మౌర్య 4316వ ర్యాంకు సాధించారన్నారు. తమ విద్యార్థులు బైపీసీతో పాటు ఎంపీసీలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల, స్ట్రెస్ ఫ్రీ ఎడ్యుకేషన్, ఫైవ్ స్టెప్స్ ప్రోగ్రామ్స్ ద్వారా ఈ విజయాలు సొంతమయ్యాయని, ఇదే స్ఫూర్తితో ముందు మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటామని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓవెల్‌కు ఉత్తమ ఫలితాలు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వేణు తెలిపారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో కొండేటి అర్పితాసజిత్ 552వ ర్యాంకు, అమర్తలూరు వెంకట నిఖిత్‌బాబు 808, రాయవరపు రాకేష్ 1054, సమాధి వెంకట సంతోష్‌కుమార్ యాదవ్ 1414, పొన్నూరు గీతేశ్వర్ 2242, పుల్లా అఖిల్ 2880, భీమతాటి అనన్య 3875వ ర్యాంకు సాధించారన్నారు. అత్యున్నతమైన విద్యా ప్రణాళిక, బోధనతోనే ఇది సాధ్యమైందని, ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రమీల, ఈడీ బాలు, ఏజీఎం గంగాధర్, టీమ్ లీడర్స్ సుధీర్, రాము, పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేతలకు ఎమ్మెల్యే నారాయణ కృతజ్ఞతలు

నెల్లూరు(వైద్యం), జూన్ 9 : నెల్లూరు సిటీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన తనను అఖండ మెజార్టీతో గెలిపించిన టీడీఏ నేతల ఇళ్లకు ఆదివారం వెళ్లిన ఎమ్మెల్యే పొంగూరు నారాయణ వారికి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావుతో పాటు బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు తదితర నేతల ఇళ్లకు వెళ్లి తనకు ఆయా డివిజన్‌లలో అత్యధిక మెజార్టీ వచ్చేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కృషి చేసి తనకు అత్యధిక ఓటింగ్ శాతం వచ్చేందుకు నేతలు ఎంతో శ్రమించారన్నారు. ఆయా నాయకులను అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ల అన్న సిద్ధాంతంతో టీడీపీ ఆవిర్భవించిందని, పార్టీ ఆశయాల మేరకు పనిచేస్తానని వెల్లడించారు. పార్టీ అగ్రనేతలతో పాటు సామాన్య కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.


కప్పిరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నారాయణ

రామోజీరావుకు పవన్‌కళ్యాణ్ అభిమానుల నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 9: జనసేన పార్టీ నాయకులు, పవన్‌కళ్యాణ్ అభిమానులు ఆదివారం రెడ్‌క్రాస్‌లో ఆదివారం ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు రాష్ట్ర పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు పోతురాజు టోనీబాబు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్‌లో పవర్ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మందికి పైగా రక్తదానం చేశారు.


రామోజీరావుకు నివాళులర్పిస్తున్న పవన్ ఫ్యాన్స్

వాకర్స్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(విద్య) : ఈనాడు గ్రూప్స్ అధినేత, అక్షరయోధుడు రామోజీరావుకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కె.జయదేవ్, వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, నేతలు రాఘవేంద్ర షెట్టి, పొన్నం రవిచంద్ర, ఓబుల్‌రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్య నాయుడు, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేసవి క్రీడాశిక్షణ పొందుతున్న క్రీడాకారులకు బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్, సీహెచ్‌పీ.ప్రభాకర్‌ల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు.

జర్నలిస్టు భవనంలో..

నెల్లూరు(సాంస్కృతికం) : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు జర్నలిస్టు భవనంలో సంతాపసభ నిర్వహించారు. రామోజీ కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.మల్లికార్జున, మురళీశంకర్, భరత్, నరేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గజేంద్ర మోక్షం ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 9 : నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం గజేంద్ర మోక్షం ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో వెలసి వున్న శ్రీరామచంద్ర మూర్తికి విశేష పూజలు జరిగాయి. రాత్రి సీతారాముల కల్యాణం అలంకారం కనువిందు చేసింది.


సీతారాముల కల్యాణ అలంకారం

వాత్సల్య విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 9 : జనహిత-వాత్సల్యలో విద్యనభ్యసించి మంచి మార్కులు సాధించిన 18 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి వంతున ఆదివారం దాతలు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వాత్సల్యలో మంచి మార్కులు సాధించిన 18 మంది విద్యార్థులలో 10 మందికి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు అధికారి బాలకృష్ణారెడ్డి, ఇద్దరికి సబ్‌ట్రెజరీ అధికారి రమణరావు, ఒకరికి ఏవో కమల్‌కిరణ్, ఇద్దరికి పబ్లిక్ హెల్త్ నర్సు సక్కుబాయమ్మ, ముగ్గురు విద్యార్థులకు హెల్త్ సూపర్ వైజర్ వసంత బహుమతులు అందచేశారని తెలిపారు. తల్లిదండ్రులు లేని బిడ్డలను ప్రోత్సాహిస్తూ వాళ్ల విద్యాభివృద్ధికి దాతలు సహాయం అందించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, సేవా టీం నిర్వాహకురాలు అరవ పరిమళ, ఖాదర్ మస్తాన్, సాయికళ్యాణ్, కల్వం శ్రీనివాసులు, గూడూరు సబ్‌ట్రెజరీ అధికారి ఎస్కే మక్బుద్, ఫార్మసీ అధికారి బానురేఖ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 9 : నగరంలోని బుజబుజనెల్లూరులో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రిమత గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన, సిద్ధాంత గ్రంథాలను, త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళీ సుందర రాజా, కోటేశ్వరరావు, సభ్యులు పాల్గన్నారు.

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 9 : నగరంలోని రామచంద్రారెడ్డి ఆసుపత్రిలోని ప్రసూతి వార్డులో గర్భిణులు, బాలింతలకు ఆదివారం విశ్వమాతా సేవా ఫౌండేషన్ బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. దూబిశెట్టి మల్లికార్జున్ జన్మదినం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు దూబిశెట్టి కళ్యాణి, డాక్టర్ రామలక్ష్మి, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ రాజు, సభ్యులు చంద్రకళ, భరత్, మల్లికార్జున్, రాము, తదితరులు పాల్గొన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



తిరుపతిలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణం అహ్లాదాన్ని పంచింది. మబ్బులు ముసురుకుని అరగంట పాటు వాన కురిసింది. వాన వెలిశాక ఆకాశాన రంగురంగుల ఇంద్రధనస్సు ఏర్పడి నగర వాసులకు కనువిందు చేసింది. తూర్పుదిశలో సాయంత్రం 6.05 గంటల నుంచి ఈ హరివిల్లు కొద్దిసేపు మానసికోల్లాసాన్ని పంచింది. తిరు నగరిలో శ్రీనివాస సేతుపైనుంచి ఈ రంగుల సోయగం కెమెరాలో బందీ అయిందిలా..

- తిరుపతి అర్బన్



పులికాట్‌కు జలకళ



● సరస్సులో పక్షుల కేరింతలు

సూళ్లూరుపేట, జూన్ 9: నిన్నమొన్నటి వరకు చుక్కనీరు లేక నెర్రెలు బారిన పులికాట్ సరస్సు నేడు జలకళను సంతరించుకుంది. వారం రోజుల నుంచి వాతావరణం చల్లబడి ఇటీవల కురిసిన వర్షాలకు సరస్సుకు భారీగా నీరు చేరింది. దీనికి తోడు ఆటుపోట్లకు బంగాళాఖాతం నుంచి సముద్రపు నీరు చేరడంతో సరస్సు నిండుకుండను తలపిస్తోంది. పులికాట్‌లో నీరులేక ఆహారం కోసం అలమటిస్తున్న విదేశీ విహంగాలు సరస్సుకు జలకళ సంతరించడంతో కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప సమీపంలోని సరస్సులో పక్షులు కేరింతలు కొడుతున్నాయి. అదేవిధంగా వేనాడుకు వెళ్లే మార్గంలో కూడా పక్షులు సందడి చేస్తున్నాయి. జాలర్లు కూడా చేపలు వేట సాగిస్తున్నారు.

మద్యం మత్తులో గొడవ

కత్తిపోటుతో యువకుడి దుర్మరణం


విజయ్‌కుమార్ మృతదేహం

వెంకటగిరి, జూన్ 9: మద్యం మత్తులో జరిగిన గొడవలో కత్తిపోటుకు గురై ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన వెంకటగిరిలో జరిగింది. సీఐ సంఘమేశ్వర రావు తెలిపిన వివరాల మేరకు.. వెంకటగిరి పట్టణం బొప్పాపురం సాలి కాలనీకి చెందిన బొక్కిసం విజయ్‌కుమార్(35) అమరరాజా కంపెనీ ఉద్యోగి. ఆదివారం కావడంతో పట్టణంలోని పాల కేంద్రం సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న పినాకినీ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగుతున్నాడు. ఈ సందర్భంగా ఈ బార్‌ను ఆనుకుని ఉన్న కూల్ డ్రింక్ షాపులో పనిచేసే శ్రీకాళహస్తి మండలం వెలంపాడు గ్రామానికి చెందిన నరసింహులుతో వివాదం తలెత్తింది. ఇద్దరూ మద్యం మత్తులో ఉండటంతో మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఈక్రమంలో నరసింహులు తన వద్ద ఉన్న కత్తితో విజయ్‌కుమార్ చాతీపై పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బిత్తరపోయిన నరసింహులు అక్కడినుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

అతిసారతో బాలిక మృతి




దళితవాడలో సహాయక చర్యలు చేపట్టిన అధికారులు - భవ్య (ఫైల్ ఫొటో)

పుత్తూరు, జూన్ 9: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం దళితవాడలో అతిసార వ్యాధితో భవ్య(12) అనే బాలిక ఆదివారం మరణించింది. ఆ పంచాయతీలో నాలుగు రోజుల కిందట రాజగోపాల్ ఆచారి మృతి చెందిన విషయం తెలిసిందే. పది రోజులుగా ఈ పంచాయతీలోని జనం.. వాంతులు, విరేచనాల బారినపడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ ప్రాంతాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పర్యటించి.. సహాయ చర్యలను చేపట్టారు. తాత్కాలిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించారు. ఈ శిబిరం సోమవారం కూడా కొనసాగిస్తామని తెలిపారు. దాదాపు 25 ఏళ్ల నాటి ఇంటి కొళాయి లైన్లను తీసి వేసి.. కొత్తవి అమర్చుతున్నారు. తాగు నీటిని కూడా రైతుల పొలం నుంచి తీసుకుని సరఫరా చేస్తున్నారు. తాత్కాలికంగా ప్రతి ఇంటికీ రెండు క్యాన్ల మినరల్ వాటర్ అందించారు. వాటర్ శాంపిల్స్ ల్యాబ్‌కు పంపామని కమిషనర్ పేర్కొన్నారు.

పతనమవుతున్న వెనామీ రొయ్య ధర



కోట, జూన్ 9: వెనామీ రొయ్యల ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోయాయంటూ బయ్యర్లు ప్రచారం చేస్తూ.. కారుచౌకగా ఆక్వా రైతుల నుంచి రొయ్యలను తన్నుకుని పోతున్నారన్న విమర్శలొస్తున్నాయి. సముద్ర తీరప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరులో రైతులు వెనామీ రొయ్యలను సాగులో పెట్టి ఉన్నారు. తైవాన్, ఇండోనేషియా, అమెరికాలో 20 రోజుల నుంచి రొయ్యల ధరలు పడిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో 100 కౌంట్ రొయ్యలు రూ.200, 90 కౌంట్ రూ.210, 80 కౌంట్ రూ.220, 70 కౌంట్ రూ.240, 60 కౌంట్ రూ.260, 50 కౌంట్ రూ.280, 40 కౌంట్ రొయ్యల ధరలు రూ.400 నుంచి రూ.300కు పడిపోయాయి. 30 కౌంట్ రొయ్యలైతే రూ.510 నుంచి రూ.430 వరకు పడిపోవడంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు సమీప మార్కెట్లలో ఆశించినంత ధరలు లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో బయ్యర్లు అడిగిన రేటుకే రొయ్యలను విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా

● దివ్యాంగుల కేటగిరీలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించిన జ్యోష్మిత

● జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థిని ప్రతిభ



తిరుపతి(విద్య), జూన్ 9: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ఆదివారం విడుదల జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో తిరుపతి నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని గుండా జ్యోష్మిత ప్రతిభ చూపారు. దివ్యాంగుల కేటగిరీలో ఆలిండియా ఫస్ట్‌ర్యాంకు సాధించారు. ఆమె మాట్లాడుతూ.. తమది తిరుపతి సమీపంలోని కరకంబాడి ప్రాంతమని, తల్లిదండ్రులు సుమలత, శ్రీనివాస్ కిరాయి దుకాణం నడుపుతుంటారని చెప్పారు. చెన్నై ఐఐటీలో కంప్యూటర్స్ ఇంజనీరింగ్ చదివి, పేరున్న సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

రైతులకు క్వాలిటీ మొక్కలు అందిస్తాం

బయోట్రిమ్ సిల్వి కల్చరిస్ట్ యశోదబాయి




ఆటో క్లేవ్స్ పరికరాలు

మంగళం, జూన్ 9: తక్కువ సమయంలో ఆదాయం వచ్చేలా క్వాలిటీ ఉన్న మొక్కలను రైతులకు అందిస్తామని తిరుపతిలోని బయోట్రిమ్ సిల్వి కల్చరిస్ట్ యశోదబాయి తెలిపారు. ఈ మొక్కలను క్వాలిటీ గల మదర్ ట్రీ ద్వారా ల్యాబ్‌లో డెవలప్ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే దాదాపు 50వేల ఎర్రచందనం మొక్కలను రైతులకు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నామని, వీటితోపాటు టేకు, వెలగ, అడవి నేరేడు, బిల్వ మొక్కలను డెవలప్ చేస్తున్నామన్నారు. అలాగే గార్డెన్లలో పెంచుకునే మొక్కలతోపాటు దాదాపు పదిరకాల మొక్కలు సిద్ధం అవుతున్నాయన్నారు. బయోట్రిమ్‌కు కొత్తగా మూడు ఆటో క్లేవ్స్ పరికరాలు తెప్పించామన్నారు. వీటితోపాటు ల్యాబ్‌కు సంబంధించిన కొన్ని పరికరాలు వచ్చాయన్నారు. దాదాపు రూ.10లక్షలతో వీటిని తెప్పించినట్లు పేర్కొన్నారు. మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేయించినట్లు తెలిపారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరుపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

డక్కిలి, జూన్ 9 : మెట్ట ప్రాంత రైతుల కలల ప్రాజెక్టు ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణంపై కొత్తప్రభుత్వం ఏర్పడడంతో రైతులు కోటి ఆశలతో ఉన్నారు. వాస్తవానికి గత టీడీపీ హయాంలో రూ.400 కోట్లతో ఈ రిజర్వాయరు నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేయించడంలో అప్పటి ఎమ్మెల్యే రామకృష్ణ ఎంతో కృషి చేశారు. పనులు కూడా 20 శాతం మేర పూర్తయ్యాయి. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రీ టెండర్ల పేరుతో రిజర్వాయరు పనులను అర్థంతరంగా నిలిపివేసింది. తర్వాత 26 శాతం లెస్‌తో రీ టెండరులో పనులు దక్కించుకున్న కాంట్రాక్టరును కొంతమంది వైసీపీ నాయకులు పనులు ముందుకు సాగనీయకుండా అడ్డుకోవడంతో నిర్మాణంలో జాప్యం జరుగుతూ వచ్చింది. నిర్మాణానికి అవసరమైన మట్టిని డక్కిలి మండలం పలుగోడు, మోపూరు, బీముడు చెరువుల నుంచి తరలించేందుకు కాంట్రాక్టరు అనుమతులు పొందినా అక్కడి రైతులు అడ్డుకోవడంతో కష్టతరంగా మారింది. దీంతో రిజార్వాయరు నిర్మాణానికి అడుగడునా అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో కాంట్రాక్టరు నష్టాలు చవిచూడాల్సి వస్తుందని పనులను నిలిపివేశాడు. దీంతో గత నాలుగేళ్లగా ఈ రిజర్వాయరు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

జగన్ హామీ ఇచ్చినా ముందుకు సాగని వైనం

ఎన్నికలకు సుమారు ఏడాదికి ముందు నేతన్న నేస్తం బటన్ నొక్కేందుకు ముఖ్యమంత్రి హోదాలో వెంకటగిరికి వచ్చిన జగన్... ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రీ టెండర్లు పిలిచి రెండేళ్లల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు.

1.70 లక్షల ఎకరాలకు సాగునీరు

ఆల్తూరుపాడు నిర్మాణం పూర్తయయితే ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు, శ్రీకాళహస్తి పట్టణం, తిరుపతి నగరాలకు తాగు నీరు అందుతుంది. కానీ పాలకులు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో మొదటి నుంచి నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

● ఇంకో రెండు రోజుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడనుండడంతో ప్రాజెక్టు నిర్మాణంపై కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి వెంకటగిరికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే రిజర్వాయరు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈక్రమంలో ప్రాజెక్టు విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని కురుగొండ్లను నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


అర్ధంతరంగా ఆగిన ఆల్తూరుపాడు రిజర్వాయరు ఎత్తిపోతల పథకం

ప్రజల ఆశీస్సులే గెలిపించాయి: పాశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూన్ 9: ఈ ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు, దేవుడి కృష తనను గెలిపించాయని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక హోసన్న ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న పాశం భావోద్వేగానికి లోనయ్యారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పేదలకు సంక్షేమ పథకాలను అం దించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాన న్నారు. ఐదేళ్లు అధికారంలో లేకపోయినా స్థానికంగా అందరికీ అందుబా టులో ఉంటూ టీడీపీ బలోపేతానికి కృషి చేశానన్నారు. దీని ఫలితమే ఈ ఎన్నికల్లో ప్రజలందరూ తనకు మద్దతుగా నిలిచి గెలిపిం చారన్నారు. పేదలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీరు స్తానన్నారు. కార్యక్రమంలో పాశం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు ఎమ్మెల్యే పాశంను సన్మానించి అభినందనలు తెలిపారు.

చిల్లకూరు: ఎమ్మెల్యేగా విజయం సాధించిన పాశం సునీల్‌కుమార్‌ను గూడూరులోని ఆయన నివాసంలో చిల్లకూరు మండలం జడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, కోటేశ్వరరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు.

లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేతలు


లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటతేజ

పెళ్లకూరు, జూన్ 9: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలో టీడీపీ సీనియర్ నేతలు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన నాయుడితో కలసి టీడీపీ ఎన్ఆర్ఐ ప్రతినిధులు పేరం వెంకటతేజ, సందీప్ తేజ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సా ధించడంతో పాటు మంగళగిరి నియో జకవర్గంలో భారీ మెజార్టీ సాధించిన లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ వారితో మాట్లాడుతూ... ఎన్నారైల సహకారం ఎన్నటికీ మరువలేనిదన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట, జూన్ 9: సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ మేరకు మొదటిసారిగా ఆదివారం ఉదయం మాజీ ఎంపీ నెలవల సుబ్ర హ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతియుతంగా పరిపాలన కొనసాగాలని వేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు.

ధర్మారెడ్డికి కనువిప్పు కలగలేదు: నెలవల

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'టీటీడీ ఈవో ధర్మారెడ్డికి దేవుడు పెద్ద శిక్షవేశాడు. అయినా ఆయనకు కనువిప్పు కలగలేదు' అని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆగ్రహించారు. శ్రీవారి దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ.. తాను రెండుసార్లు టీటీడీ బోర్డు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసినా ఎన్నడూ ఇలాంటి నిరంకుశ అధికారిని చూడలేదన్నారు. మాజీ నేతలకు దర్శన అవకాశం కల్పించకుండా వేధించారని ఆరోపించారు. ధర్మారెడ్డి తన బాస్ జగన్ తరహాలో నిరంకుశత్వంతో టీటీడీని భ్రష్టుపట్టించారన్నారు. తిరుమలకు పట్టిన శని ధర్మారెడ్డితో వదిలిపోవాలన్నారు. మంచి అధికారులను తీసుకొచ్చి టీటీడీలో పరిపాలన అందిస్తామన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సత్కారం



పెళ్లకూరు, జూన్ 9: సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీని టీడీపీ మం డల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలు వాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సన్మానించారు. కె.ఉదయ్‌నాయుడు, నరేంద్రనాయుడు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. పెళ్లకూరు టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యంను సన్మానించనున్నారు.

రేపు సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, జూన్ 9: సూళ్లూరుపేట మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం ఈనెల 11న మంగళవారం గాండ్లవీధిలోని శ్రీ స్వశక్తి భవనంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని కమిషనర్ చెల్లు గంగాప్రసాద్ తెలిపారు. వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులతోపాటు అధికారులందరూ హాజరుకావాలని పేర్కొన్నారు.

కురుగొండ్ల విజయంపై మొక్కులు చెల్లించుకొంటున్న టీడీపీ నేతలు



డక్కిలి, జూన్ 9 : వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ ఘనవిజయం సాధిస్తే గ్రామ దేవత ఎల్లమ్మకు 101 టెంకాయిలు కొడతామని మొక్కుకున్న వెలికల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఆ మొక్కు తీర్చారు. జి.చంద్రశేఖరరెడ్డి, పరంధామరెడ్డి, బాలకృష్ణారెడ్డి, కె.సుధాకరరెడ్డి తదితరులు ఉన్నారు.

జేఈఈ ఫలితాల్లో గూడూరు విద్యార్థి ప్రతిభ


దివ్యపూర్ణచంద్

గూడూరు, జూన్ 9: జేఈఈ అడ్వాన్సుడు పరీక్షా ఫలితాల్లో గూడూరుకు చెందిన పేటేటి నాగ కోటేశ్వరరావు, స్వాతి కుమారుడు దివ్యపూర్ణచంద్ ఆల్ ఇండియా 98వ ర్యాంకు(ఈడబ్ల్యూఎస్) సాధించాడు. గూడురు పట్టణంలోని స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి దివ్యపూర్ణచంద్ విజయవాడలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. జేఈఈ అడ్వాన్సుడ్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆల్‌ఇండియా స్థాయి 98వ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. దీంతో విద్యార్థి దివ్యపూర్ణచంద్‌కు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

గూడూరు, జూన్ 9: మండలంలోని పోటుపాళెంలో ఆదివారం విద్యుదాఘాతంతో గొర్రె మృతి చెందింది. గ్రామానికి చెందిన నరేష్ గొర్రెలను మేతకు తీసుకువెళ్లాడు. మేస్తున్న సమ యంలో విద్యుత్ తీగ తెగి గొర్రెపై పడడంతో విద్యుదాఘాతానికి గురైన గొర్రె మృతి చెందింది. సుమారు రూ.10 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు ఆహార పొట్లాల పంపిణీ



వెంకటగిరి టౌన్, జూన్ 9: పట్టణంలోని పారిశుధ్య కార్మికులకు స్వామి వివేకానందా యువ సైన్యం ఆధ్వ ర్యంలో ప్రకృతి కుమార్ ఆహార పొట్లాలు పంపి ణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉదయం 4గంటల నుంచి పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దే పారిశుధ్య కార్మికులకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి టౌన్/ సూళ్లూరుపేట, జూన్ 9: వెంకటగిరి పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానం నుంచి పెరుమాళ్ల స్వామి ఆలయం వరకు యాత్ర సాగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి భాస్కర్ మాట్లాడుతూ... దేశంలో హిందువుగా పుట్టినందుకు గర్వించాలన్నారు. గతంలో హిందువులకు రక్షణ లేకుండా పోయిందని నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యాక హిందువు సగర్వంగా చెప్పుకుంటుంటున్నారని అన్నారు. ర్యాలీలో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, సీఐ సంగమేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహకులు మల్లిఖార్జున్, నర్రారవి, గూడూరు వెంకటేశ్వర్లు, తదితరులు తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం బ్రాహ్మణ వీధిలో ఉన్న రామాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో మురళీరెడ్డి, కమ్మిరెడ్డి, కృష్ణా రెడ్డి, సుంకర ప్రతిమ, గోపి, ఉషా, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో జరిగిన హనుమాన్ శోభాయాత్ర

అభివృద్ధికి నోచుకోని అంతర్గత రోడ్లు



అధ్వానంగా ఉన్న వీరారెడ్డిపల్లికి వెళ్లే అంతర్గత రోడ్డు - చిల్లకూరు మండలంలోని ఏరూరులో దారుణంగా ఉన్న రోడ్డు

గూడూరు, జూన్ 9: నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో గుంతలమయమయ్యాయని గ్రామీణులు చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా లోకేశ్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో దళిత, గిరిజన కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించారని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతర్గత రోడ్ల అభివృద్ధిని విస్మరించడంతో దారుణంగా మారాయంటున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదచారుల సైతం బురద రోడ్లలో నడక సాగించాలంటే ఇబ్బంది తప్పడంలేదంటున్నారు. గూడూరు పట్టణం నుంచి వీరారెడ్డిపల్లికి వెళ్లే మార్గం, సుందరయ్యకాలనీ, చవటపాళెం నుంచి దివిపాళెంకు వెళ్లే మార్గం, చెన్నూరులోని రామలింగయ్యకాలనీ, బీసీకాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిల్లకూరు మండలంలోని తొణుకుమాల, ఏరూరు, ఓడూరు, ముత్యాలపాడు తదితర గ్రామాల్లో రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. కోట మండలంలో శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, వెంకన్న పాళెం, జరుగుమల్లి, చెందోడు, వాకాడు మండలంలోని తిరుమూరు, దుగరాజపట్నం, చీమలపాడు, వాకాడు తదితర గ్రామాల్లో అంతర్గతరోడ్లు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించాలంటే అవస్థలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని పలు దళితవాడలు, గిరిజన కాలనీలలో ఇవే పరిస్థితులు నెలకొన్నాయని, అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుతున్నారు.


దుస్థితిలో ఉన్న శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీకి వెళ్లే రోడ్డు

టీడీపీ మద్దతుతోనే అండమాన్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయం

డక్కిలి, జూన్ 9: సార్వత్రిక ఎన్నికల్లో అండమాన్ నికోబార్ దీవుల్లో టీడీపీ మద్దతుతోనే అక్కడి బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయం సాధించారని టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు చెప్పారు. ఆదివారం ఆయన ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం వైభవోపేతంగా జరిగిందని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ధ్యేయం

నాయుడుపేట టౌన్, జూన్ 9: అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత ఎస్.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాంధీమందిరం సెంటర్ వద్ద ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు డి.రాజేంద్ర, సుజాతమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఏ ప్రాంతంలో అయినా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాజేష్, 786 రఫి, జి.సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, కన్నెమ్మ, సంపూర్ణమ్మ, కోటిరెడ్డి, జిలక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

గుర్రప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



డక్కిలి, జూన్ 9: మండలంలోని తిమ్మాయపాళెం సమీపంలోని గుర్రప్ప స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం భక్తులు ఈ ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొంటారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకుడు భాస్కర్ తెలిపారు.

కోటమ్మకు పూజలు



కోట, జూన్ 9 : గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాహుల్‌తోనే కాంగ్రెస్‌కు పూర్వవైభవం

గూడూరు అర్బన్, జూన్ 9: రాహుల్ గాంధీతోనే కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం సాధ్యమవుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, నాయకుడు వేమయ్య అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ లోక్‌సభలో కాంగ్రెస్‌పార్టీ పక్షనేతగా రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నికకావడం సంతోషించదగ్గ విషయమన్నారు. దేశాభివృది, నిరుద్యోగ యువత, ధరల స్థిరీకరణ కోసం అధికారపక్షంతో పోరాటం చేయగల సమర్థత రాహుల్‌కు ఉందన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి


గూడూరులో బీజేపీ నాయకుల సంబరాలు

గూడూరు అర్బన్, జూన్ 9: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ పట్టణాధ్యక్షుడు ఏ.బాలకృష్ణమనాయుడు అన్నారు. ఆదివారం మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టవర్‌క్లాక్ కేంద్రం వద్ద స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో అన్నదానం నిర్వహించారు. వి.పురుషోత్తమరెడ్డి, దయాకర్, ఇంద్రవర్ధన్, ప్రకాశ్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: దేశ ప్రధానిగా మూడో సారి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం చిట్టమూరులోని కొత్తగుంట కూడలిలో కూటమి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మండల కన్వీనర్ దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. శరత్‌చంద్రారెడ్డి కేక్ కట్ చేసి టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడికి తినిపించారు. బీజేపీ, టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నృత్య విద్యార్థినుల ప్రతిభ



గూడూరు, జూన్ 9: ఒడిశా రాష్ట్రంలోని పురి నగరంలో ఆదివారం జరిగిన జగన్నాథ నృత్యోత్సవంలో గూడూరుకు చెందిన శివలలిత భరత నాట్య కళాక్షేత్రం కళాకారులు ప్రతిభ చాటారు. కళాక్షేత్రం వ్యవస్థాపకులు మల్లిక, వెంకయ్య మాట్లాడుతూ... పురి నగర్‌లోని అన్నపూర్ణా రంగమాన్‌చా ఆడిటోరియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కళాకారులు హజరయ్యారన్నారు. తమ కళాక్షేత్రానికి చెందిన కళాకారులు ప్రతిభ చాటడంతో అకాడమీ అధ్యక్షుడు లలితారావు చేతుల మీదుగా జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందుకున్నారన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 9: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం



వెంకటగిరి టౌన్, జూన్ 9: పట్టణంలో గత రెండు రోజులుగా వర్షం పడడంతో వాతావరణం చల్లబ డింది. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా వర్షం పడింది. దీంతో చెరువుల్లో కూడా కొన్ని నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల కారణంగా వర్షలు పడుతున్నాయని ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారు.

కోటలో కుండపోత వర్షం

కోట: మండలంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. 40 నిమిషాల పాటు ఈదురుగాలులు, బీభత్సం సృష్టించాయి. మండలంలోని కోట, విద్యానగర్, నెల్లూరుపల్లి, తిన్నెలపూడి, గూడలి, తదితర గ్రామాల్లో పెను గాలులు వీచాయి.

ఆగిన ఇసుక విక్రయాలు


నేతాజీనగర్ వద్ద డిపోలో నిల్వ ఉన్న ఇసుక

దొరవారిసత్రం, జూన్ 9: మండలంలోని నేతాజీనగర్ వద్ద ఉన్న ఇసుక డిపో లో విక్రయాలు ఆగాయి. రెండు రోజుల నుంచి విక్రయించడం లేదు. తిరుపతి గనుల శాఖ అధికారులు వచ్చి డిపో నుంచి విక్రయాలు చేయరాదని ఆదేశించడంతో గుత్తేదారులు వాహనాలు తీసుకుని వెళ్లిపోయారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇసుకను ఎవ్వరు తరలించకుండా రెవెన్యూ శాఖ అధికారులు సిబ్బందిని కాపలా పెట్టారు. కోడ్ సమయంలో కూడ వాకాడు స్వర్ణముఖి నది నుండి ఇక్కడికి ఇసుకను తీసుకు వచ్చి నిల్వ ఉంచారు. అలాగే ఓ వైపు ఇసుకను విక్రయించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం మారడంతో భారీగా నిల్వ చేసిన గుత్తేదారుడికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. రాత్రికిరాత్రి ఇసుకను తరలించే ఏర్పాట్లు చేపట్టగా గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు జిల్లా అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో జిల్లా గనుల శాఖ అధికారులు గుత్తేదారులను ఇసుక డిపో నుంచి ఖాళీ చేయించారు. ఇసుక విక్రయాలను అడ్డుకున్నారు.

కారు ఢీ కొని ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 9: పట్టణానికి సమీపంలోని తుమ్మూరు సమీపంలో కారు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శేషయ్య, నాగరాజు మేనకూరు సెజ్‌లోని ఓ కంపెనీలో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తుమ్మూరు వద్ద బస్సులను నిలిపి రోడ్డు పక్కన వస్తుండగా కారు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శేషయ్య, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యానికి నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి కాచి బెదిరించి బైక్‌తో పరారీ

తడ, జూన్ 9: పరిశ్రమలకు విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరిన ఇద్దరిని బెదిరించి వాహనంతో పరారయ్యారు. వరదయపాళ్యం మండలం పులియాలం గ్రామానికి చెందిన ఎం.పరంధాం, రవి అపాచీ పరిశ్రమలో పని చేస్తుంటారు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బైక్‌పై ఎన్ఎంకండ్రిగ మీదుగా బయలుదేరారు. మార్గమధ్యంలో మాంబట్టు సెజ్‌లో దట్టమైన చెట్లు ఉన్న ప్రదేశానికి వచ్చేసరికి అక్కడ ముగ్గురు వ్యక్తులు రోడ్డుపై అడ్డంగా నిలబడి బైక్‌ను ఆపారు. బైక్ నడుపుతున్న ఇద్దరిని బెదిరించి వారి వాహనంతో పరారయ్యారు. దీంతో బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం: నెలవల



నాయుడుపేట, జూన్ 9: నిరుద్యోగ యువత ఉపాధికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఈలోగా నిరుద్యోగ భృతి అందిస్తుందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేటలో ఆదివారం నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిని తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు జి.రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో సత్కరించారు. గత ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేసి, సచివాలయ ఉద్యోగాలతోనే సరిపెట్టిందని విమర్శించారు. స్కిల్ డెవలెప్‌మెంట్‌తోపాటు ఉపాధి అవకాశాలను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని నెలవల భరోసా ఇచ్చారు.భాస్కర్‌రెడ్డి, ఎం.సూరి, వెంకటేశ్వర్లురెడ్డి, నానాబాల సుబ్బారావు, బి.నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తీరని లోటు

చిల్లకూరు, జూన్ 9: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి పత్రిక, సినీరంగాలతోపాటు తెలుగుజాతికి తీరని లోటని టీడీపీ నాయకుడు, పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ అన్నారు. ఆదివారం జ్యోతి వేబ్రిడ్జి కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు అనేక సంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మందిని ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లురెడ్డి, కొండా రామ చంద్రారెడ్డి, ఎం.కుమార్‌యాదవ్, శ్రీనివాసులు నివాళి అర్పించారు.

అభివృద్ధి వైపు పరుగులు



చిట్టమూరు, జూన్ 9: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందే రాష్ట్రం అభివృద్ధి వైపు రాష్ట్రం పరుగులు పెడుతోందని టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు అన్నారు. ఆదివారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... టీడీపీ అధినేత ఆదేశాల మేరకు... రాగద్వేషాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమం వైపు దృష్టి పెడతామన్నారు. గూడూరు టీడీపీ ఎమ్మెల్యేగా సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈనెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం సమయంలో చిట్టమూరులో విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.